ఆదివారం
04-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 223
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దిగివచ్చిన ఫ్రాన్స్ ప్రభుత్వం

పారిస్: ఫ్రాన్స్ ప్రభుత్వం దిగివచ్చింది. రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించింది. దీంతో తక్కువ ఆదాయాలు, భారీగా ఆంక్షలు, విదేశాల నుంచి అక్రమ పోటీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులు శాంతించారు. ప్రభుత్వం నుంచి హామీ లభించడంతో తమ ఆందోళనను విరమించారు. యంగ్ ఫార్మర్స్ యూనియన్ అధ్యక్షుడు అర్నాడ్ గాలియట్‌లు మాట్లాడుతూ ప్రధాన రహదారుల దిగ్బంధనాలను విరమించాలని సభ్యులకు పిలుపునిచ్చారు. రైతులకు, వైన్ ఉత్పత్తిదారులకు ఆర్థిక తోడ్పాటునకు చర్యలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొత్త ప్యాకేజీతో పాటూ మరికొన్ని హామీలను ఇచ్చిందని చెప్పారు. వ్యవసాయానికి భవిష్యత్ ఏమిటని యూరప్ వ్యాప్తంగా రైతాంగం తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసిన విషయం విదితమే.

అడ్వాణీకి భారతరత్న

- 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మోదీ
- నాకు భావోద్వేగమైన క్షణమని ప్రధాని వెల్లడి
- ప్రముఖుల శుభాకాంక్షలు
- నా సేవలు, సిద్ధాంతాలకు గుర్తింపు: అడ్వాణీ

2లో

సీట్ల సర్దుబాటుపై కమిటీ

- సభ్యులుగా రాజా, నారాయణ, పాండా
- 16న సమ్మె, గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు
- సీపీఐ జాతీయ సమితి తీర్మానాలు

విశాలాంధ్ర–హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి 'ఇండియా' కూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని సీపీఐ జాతీయ సమితి సమావేశం నియమించింది. కమిటీ సభ్యులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, రామ కృష్ణ పాండాలను ఎంపిక చేసింది. కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా నెల 16న చేపట్టిన సమ్మె, గ్రామీణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ ప్రవేశపెట్టిన తీర్మానానికి జాతీయ సమితి ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చింది. కార్మిక, రైతు, నిరుద్యోగం, వ్యవసాయ సమస్యలు ప్రస్తావించకుండా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బీకే కాంగో ప్రవేశపెట్టిన మరో తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ సమితి సభ్యులు నిషా సిద్ధు, జాతీయ కార్యవర్గ సభ్యులు, కూనంనేని సాంబశివ రావు హాజరవ్వగా దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలపై డి.రాజా నివేదిక సమర్పించారు. సీపీఐ జాతీయ సమితి అనేక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

కేంద్ర బడ్జెట్ ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని, అసమానతలు తొలగించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సీపీఐ జాతీయ సమితి విమర్శించింది. బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని దుయ్యబట్టింది. దేశాన్ని, ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటానికి ప్రజాస్వామ్య, లౌకికశక్తులు మద్దతుగా నిలవాలని కోరింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో (2014- 2022 వరకు) 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపింది. కార్మికుల వేతనాలు పెరిగాయని కేంద్రం చెప్పడం అబద్ధమని, దేశంలో అత్యంత ప్రధాన నిరుద్యోగ సమస్యను బడ్జెట్ ప్రస్తావించలేదని విమర్శించింది.

ప్రజల జీవితాలు, జీవనోపాధిపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం దాడులు కొనసాగిస్తోందని, వివిధ చట్టాలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు, విధాన పరమైన డ్రైవ్ ద్వారా కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చర్యలను దూకుడుగా కొనసాగిస్తోందని ఆరోపించింది. ప్రజలచేత ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తోందని, అసమ్మతి స్వరాలను అణిచివేస్తోందని దుయ్యబట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని, రాజ్యాంగ సంస్థలను వర్గీకరించే ప్రమాదకరమైన క్రీడ కొనసాగుతోందని తెలిపింది. మీడియా, జర్నలిస్టుల స్వేచ్ఛపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని, లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నేరస్తులను రక్షిస్తోందని విమర్శించింది. విద్య, ఆరోగ్య రంగాలకు బడ్జెట్ కేటాయింపులు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని, 2014–15లో మొత్తం బడ్జెట్ రూ.1.85 శాతం నుండి 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.33 శాతానికి పడిపోయిందని వివరించింది. నిరుద్యోగ రేటు 8.7 (సీఎంఐఈ) ఉండగా, మహిళల కార్మిక భాగస్వామ్య రేటు కూడా చాలా తక్కువగా నమోదైందని, దాదాపు 60 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని, ఉద్యోగ మార్కెట్ పడిపోయిందని తెలిపింది. సీపీఐ జాతీయ సమితి తీర్మానాలను కె.నారాయణ, బాలచంద్ర కాంగోతో కలిసి హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు. కార్మిక, రైతు, ఉద్యోగ, నిరుద్యోగ వ్యతిరేక నిర్ణయాలతో భారతదేశం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ పదేళ్ల పాలనలో ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సోషలిజం ప్రాథమిక సూత్రాలను కాపాడేందుకు జరుగుతున్న పోరాటంలో అందరూ ముందుకు రావాలన్నారు. పాలకులకు తగిన గుణపాఠం తప్పదని రైతు, కార్మిక పోరాటాల ద్వారా నిరూపణ జరిగిందన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనం కలిగించేందుకుగాను 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా

- మిగతా 2 లో

అంతా అయోమయం!

- ఏడో జాబితాపై అధిష్ఠానం కసరత్తు
- మరో ఆరు ఎంపీ స్థానాలపై దృష్టి
- సిద్ధం సభకు ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేల డుమ్మా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ చేపట్టిన ఇన్‌చార్జిల మార్పులు, చేర్పులతో లాభమా? నష్టమా? అనేదీ తెలియక ఆ పార్టీ నేతల్లో అయోమయం నెలకొంది. అధినేత ఆదేశాల మేరకు ఎక్కడికి పంపితే అక్కడికి ఇన్‌చార్జిలు వెళ్లి బాధ్యతలు స్వీకరిస్తున్నారు. రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలకు ఇప్పటివరకు 17 ఎంపీ స్థానాలకు మార్పులు, చేర్పులు చేశారు. మరిన్ని జాబితాలు వస్తాయన్న సమాచారంపై వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. రాబోయే జాబితాలో మరో ఆరు ఎంపీ స్థానాలకు ఇన్‌చార్జిలను మార్చే అవకాశముంది. సర్వేల రీత్యా కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి స్థానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని సమాచారం. అదే సమయంలో కొన్ని ఎమ్మెల్యే స్థానాలను మార్చు తారన్న ప్రచారముంది. ఇప్పటివరకు విడుదల చేసిన ఐదు జాబితాల్లో కొంతమందిని జడ్పీటీసీ, డిప్యూటీ మేయర్‌గా ఉన్న వారిని ఎంపిక చేశారు. మరికొందరు సామాన్యులను ఇన్‌చార్జిలుగా ప్రకటించారు. మంత్రులు ఉషశ్రీ చరణ్, మేరుగు నాగార్జున, తానేటి వనితలకు స్థానచలనం కలిగింది. మంత్రి జయరామ్‌కు అసలు సీటే లేదు. ఆయనను కర్నూలు ఎంపీ ఇన్‌చార్జిగా ప్రకటిం చడంపై అసంతృప్తికి గురయ్యారు. తిరిగి తనను ఎమ్మెల్యేగా కొనసాగించాలని కోరినప్పటికీ, అందుకు అధిష్టానం నిరాకరించింది. మంత్రి జయరామ్ దాదాపు పది రోజులపాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరవ్వగా, ఆయనపై వైసీపీ ముఖ్యనేతలు సీరియస్ అయినట్లు తెలిసింది. ఇప్పటికే జయరాజ్ స్థానంలో కర్నూలు మేయర్‌ను రంగంలోకి దించారు. ఒంగోలు ఎంపీగాను, జిల్లాకు అదనపు సమన్వయకర్తగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ప్రతిపాదించడంపై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు ఎంపీగా మాగుంటను తిరిగి నిలిపేందుకు ఆయన అధిష్ఠానం దగ్గర

- మిగతా 2 లో

రేపటి నుంచి సభా సమరం

ఎన్నికలే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాలు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూలు విడుదల కానున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానున్నాయి. ఈ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా ఎన్నికలే అజెండాగా అధికార, ప్రతిపక్ష పార్టీలు వినియోగించుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలున్న దృష్ట్యా సహజంగానే అధికార పార్టీ ఈ సమావేశాలను పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటుంది. సమావేశాల్లో ప్రవేశపెట్టే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో పాటు, సవరణ బిల్లులు, వివిధ అంశాలపై చేపట్టే చర్చలన్నీ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు గురించే ఉండనున్నాయి. వీటిని ఏరకంగా తిప్పికొట్టాలనే దానిపై టీడీపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వైసీపీ

- మిగతా 2 లో

ప్రజలే నా సైన్యం

- సంక్షేమమే నా అస్త్రం
- మరో విజయానికి సిద్ధం
- దెందులూరు సభలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు: ప్రజలే నా సైన్యమని, సంక్షేమమే నా అస్త్రమని ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పేదింటి భవిష్యత్తును మార్చే పరిపాలన అందించేందుకు నేను సిద్ధం... మరోసారి గెలిపించేందుకు మీరందరూ సిద్ధమా అంటూ పార్టీ శ్రేణులను ప్రశ్నించారు.

ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం వైసీపీ ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభలో ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 50 నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగిస్తూ, దుష్ట చతుష్టయం మీద యుద్ధానికి సిద్ధమా... అని వైసీపీ శ్రేణులను ప్రశ్నించారు. ఎల్లో మీడియా విపక్షాల రూపంలో ఇక్కడే ఉన్నారంటూ జగన్ గుర్తుచేశారు. ఇంతమంది తోడేళ్ల మధ్య జగన్ ఒంటరిగానే కనిపిస్తాడని, విపక్షాలకు ఉన్న సైన్యం వారి పొత్తులు, ఎల్లో మీడియా అయితే కోట్లాది మంది ప్రజల హృదయాలలో మీ జగన్ ఉన్నాడని, ప్రజలే తన సైన్యమని తెలిపారు. ఇక్కడ కనిపిస్తున్న జనమే తన నమ్మకం, బలం అన్నారు. వైసీపీ ప్రభుత్వ చేస్తున్న సంక్షేమం, మంచిపై, పేదవాడి సంక్షేమం మీద, రాబోయే తరం విద్యావిధానాలపై విపక్షాలు దాడి చేస్తున్నాయని విమర్శించారు. గ్రామాల్లో మార్పు కనిపిస్తోందని, తమ సంక్షేమ పాలనకు ప్రతి పేద కుటుంబమే సాక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికలలో మరోసారి విజయం సాధించడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం నూరు శాతం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏం చేశారో ప్రశ్నించాలని జగన్ సూచించారు. చంద్రబాబు, జగన్ పాలనకు మధ్య తేడాను గమనించాలన్నారు. 57 నెలల్లో 124 సార్లు బటన్ నొక్కానని, తన కోసం రాబోయే ఎన్నికలలో రెండు బటన్లు నొక్కాలని కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు

- మిగతా 2 లో

ఉప్పు రైతు ఉక్కిరిబిక్కిరి!

- భారీగా పతనమైన ధరలు
- ఎగుమతులు లేక దిబ్బలుగా దర్శనం
- విలవిల్లాడుతున్న వ్యాపారులు
- సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వైనం

విశాలాంధ్ర బ్యూరో– ఏలూరు: ఉప్పు లేనిదే రుచి లేదు. ఏ వంటకంలోనైనా ఉప్పు ఉండాల్సిందే. అలాంటి ఉప్పు రైతులు నేడు సంక్షోభంలో కూరుకుపోయారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉప్పు రైతులు గిట్టుబాటు ధరలు లేక విలవిల్లాడిపోతున్నారు. దిగుమతులు భారీగా పెరగడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం మే, జూన్‌లో ఉప్పు ఉత్పత్తి అధిక వర్షాలకారణంగా తగ్గిపోవడంతో ధరలు భారీగా పెరిగాయి. దీంతో రైతులు ఆర్థికంగా బలపడ్డారు. ఈ సంవతర్సం వర్షభావ పరిస్థితులు నెలకొనటంతో గత అక్టోబరులో ఉప్పు ఉత్పత్తి పెరగడంతో ధరలు అమాంతం పడిపోవడంతో ఇటు వ్యాపారులు, రైతులు ఆర్థికంగా పతనావస్థకు చేరారు. గతంలో ఇదే రోజుల్లో 17.5 టన్నుల ఉప్పు లారీ రూ. 70 వేలకు పైగా ఉండగా ఈ ఏడాది కేవలం రూ.33 వేల నుంచి 35 వేలు మాత్రమే పలుకుతుండడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. జిల్లా వ్యాప్తంగా రాబోయే రోజుల్లో వర్షభావ పరిస్థితులు నెలకొంటే ఉప్పు కొనుగోలు చేసే నాథుడే ఉండరని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా పెదమైనవాని లంక, వేముల దీవి, తూర్పు తాళ్ళు, కేపీ పాలెం తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ప్రధానంగా జనవరి చివరి వారం నుంచి ప్రారంభమై జూన్, జులైలో ఆగిపోతుంది. రైతులు, వ్యాపారులు ఎప్రిల్, మే, జూన్, జులైలో ఉత్పత్తిని నిల్వచేసి అక్టోబరు, నంబరు, డిసెంబరు లో విక్రయించడం జరుగుతుంది. ఆ రోజుల్లో ఒక్కో లారీ రూ.32 వేల నుంచి 40వేల వరకు పలుకుతుంది. అధిక ధర లభిస్తే ఉప్పు రైతులు నవంబరు, డిసెంబరు నెలల్లో విక్రయించి ఆర్థికంగా బలపడతారు. కానీ, ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉప్పు దిగుబడులు రావడం, నిల్వచేసిన ఉప్పు ఎగుమతులు కాక దిబ్బలు దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల ప్రభావం కారణంగా ఒక్కో వ్యాపారుడికి, రైతుకు లారీకి రూ.5 వేల వరకు నష్టం వాటిల్లే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉప్పు ఎక్కువగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతూ ఉంటుంది. ఆయా ప్రాంతాలకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఎగుమతులు అవుతుండడంతో ధరలు పతనావస్థకు చేరాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అధిక దిగుబడులు, తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని నట్టేట ముంచాయని చెప్పవచ్చు.

50 శాతం తగ్గిన ఉత్పత్తి...

రాష్ట్రానికి ఏడాదికి ఆరున్నర లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అందులో 50 శాతం మాత్రమే ఉత్పత్తి జరుగుతుందని అధికారులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన రాష్ట్రంలో చాలా మంది దీనిమీదే డబ్బు సంపాదిస్తుంటే ఇక వుండబట్టలేక...

పంజాబ్ గవర్నర్ ఆకస్మిక రాజీనామా



చండీగఢ్: పంజాబ్ గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ పాలకుడు భన్వరిలాల్ పురోహిత్ శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతికి సమర్పించిన లేఖలో పేర్కొన్నారు. రాజ్ భవన్ అధికార వర్గాల వివరాల ప్రకారం... గవర్నర్ శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పంజాబ్ గవర్నర్, చండీగఢ్ పాలకుడి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తన రాజీనామా లేఖను పంపారు. 'నా వ్యక్తిగత కారణాలు, కొన్ని ఇతర కట్టుబాట్ల కారణంగా నేను పంజాబ్ గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ పదవికి రాజీనామా చేస్తున్నాను. దయచేసి దానిని అంగీకరించండి' అని

- మిగతా 2 లో

తహసీల్దార్ దారుణ హత్య

- అపార్ట్‌మెంట్ గేటు వద్దే ఇనుపరాడ్‌తో దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రక్షణ కల్పించాలి: రెవెన్యూ అధికారుల డిమాండ్
- వైసీపీ పాలనలో విశాఖలో అశాంతి: విపక్షాల ఆగ్రహం
- భూ తగాదాలే కారణం?

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ప్రశాంత విశాఖలో అశాంతి నెలకొంది. మొన్నటికిమొన్న విశాఖ ఎంపీ ఎం.వి.వి. సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన రౌడీ షీటర్ల ఉదంతం మరవకముందే విశాఖ శివారు కొమ్మాదిలో ఓ తహసీల్దార్ హత్యతో నగరం ఉలిక్కిపడింది. మండల మేజిస్ట్రేట్ అధికారైన తహసీల్దార్‌పైనే హత్యకు పాల్పడిన

- మిగతా 2 లో

ఆ ఏడుగురు ఎవరో చెప్పండి

కేజ్రీవాల్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు

8లో

జార్ఖండ్‌లో బలపరీక్ష రేపు

హైదరాబాద్ రిసార్టులో ఎమ్మెల్యేలకు పోలీసు భద్రత

జోర్డాన్‌లో ప్రముఖుల ఫోన్లలో 'పెగాసెస్'

అమ్మాన్: జోర్డాన్‌లో ప్రముఖ జర్నలిస్టులు, రాజకీయ నాయకుల ఫోన్లు హ్యాకింగ్‌కు గురయ్యారు. ఇటీవల వివాదాస్పదంగా మారిన 'పెగాసెస్' ద్వారానే ఈ హాకింగ్ జరిగినట్లు డిజిటల్ హక్కుల సంస్థ 'యాక్సెస్ నౌ' వెల్లడించింది. ఫోన్లు హాకింగ్‌కు గురైన వారిలో న్యాయవాదులు, మానవహక్కుల కార్యకర్తలు కూడా ఉన్నట్లు తెలిపింది. 2020 నుంచి 2023 వరకు హ్యాకింగ్ జరిగిందని పేర్కొంది. పెగాసెస్ ఆపరేటర్లు ఇద్దరికి జోర్డాన్ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. 2022 హ్యాకింగ్ బాధితుల నివేదికలో ఈ మేరకు వివరాలను యూనివర్సిటీ ఆఫ్ టొరంటో ఆఫ్ సిటిజెన్ ల్యాబ్‌లోని డిజిటల్ పరిశోధకులు వెల్లడించారు. ఈ నివేదికపై జోర్డాన్ ప్రభుత్వం స్పందించలేదు. ప్రముఖుల ఫోన్లపై నిఘా పెట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి తప్ప మరెవరికి ఉంటుందని మానవహక్కుల వాచ్ డిప్యూటీ డైరెక్టర్ ఆడమ్ ప్రశ్నించారు. ఆడమ్ ఫోన్ కూడా హాక్ కాగా, మహిళలు, కార్మికులు, ఖైదీల హక్కుల కోసం పోరాడే న్యాయవాది హలా అహద్ ఫోన్‌ను హాక్ చేసేందుకు రెండుసార్లు ప్రయత్నం జరిగిందని, 2021, మార్చి విజయవంతం కాగా, గతేడాది ఫిబ్రవరిలో విజయవంతం కాలేదని 'యాక్సెస్ నౌ' పేర్కొంది. ప్రముఖ పలస్తీనియన్-అమెరికన్ జర్నలిస్ట్, కాలమిస్ట్ దావూద్ కూతాబ్ ఫోను 2022 ఫిబ్రవరి-2023 సెప్టెంబర్ మధ్య మూడుసార్లు హ్యాకింగ్‌కు గురైందని తెలిపింది. మరో 15 మంది జర్నలిస్టులు, మీడియా ఉద్యోగుల ఫోన్‌లు హ్యాకయ్యాయని పేర్కొంది. జోర్డాన్‌లో పెగాసెస్ బాధితుల సంఖ్య అధికంగానే ఉండవచ్చని యాక్సెస్ నౌ తెలిపింది. సుమారు 35 మంది వ్యక్తుల ఫోన్‌లపై నిఘా పెట్టి ఉండవచ్చని యాక్సిస్ నౌ సంస్థకు చెందిన వెస్ట్ ఏసియా అండ్ నార్త్ ఆఫ్రికా డైరెక్టర్ మార్వా తెలిపారు. ఐదుగురు ఫోన్‌లలో పెగాసెస్‌ను సిటిజన్ ల్యాబ్ గుర్తించగా, మిగిలిన వాటిని హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్స్ సెక్యూరిటీ ల్యాబ్, ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ మిగిలిన ఫోన్‌లలో పెగాసెస్‌ను గుర్తించింది.

ఉప్పు రైతు ఉక్కిరిబిక్కిరి!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రతి సంవత్సరం ఉప్పు పండించే సీజనులో వర్షాలు పడటంతో ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఉప్పు ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకు పోయింది. ఉప్పు భూముల్లో రొయ్యల సాగు చేయడమే దీనికి ప్రధాన కారణం అని రైతులు చెబుతున్నారు. గతంలో వేముల దీవి, కేపీ పాలెం, తూర్పు తాళ్ళు, పెదమైని వాని లంక ప్రాంతాల్లో సుమారు ఏడు వేల ఎకరాల్లో ఉప్పు సాగు అయ్యేది.కానీ నేడు కేవలం పెదమైనవానిలంక ప్రాంతంలో మాత్రమే సాగు చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప్పు సాగయ్యే భూములను రొయ్యల చెరువులుగా మార్చడం వలన ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఉప్పు తయారు చేసినా నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు.

ఎన్నికల వాగ్దానం విస్మరించిన సీఎం జగన్

2019 ఎన్నికలను పురస్కరించుకుని నరసాపురం పర్యటనలో.. తాను అధికారం చేపడితే ఉప్పు రైతులను ఆదుకుంటానని జగన్ హామీ ఇచ్చారు. అనుకూల పరిస్థితుల్లో ఉప్పు తయారుచేసి గిట్టుబాటు ధర వచ్చే వరకు తీర ప్రాంతంలో తాను కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తానని, బోర్లు వేయిస్తానని వాగ్దానం చేసి అధికారం చేపట్టిన తర్వాత తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. గత సంవత్సరం మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ఉప్పు రైతులకు రూ.2,500 ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి తమను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు.

మద్దతు ధర లేదు....

ప్రస్తుతం ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది.. ప్రస్తుతం రేటు టన్ను రూ.2,500 కూడా పలకటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా రావడం లేదని పెదమైనివాని లంక గ్రామ రైతులు పొన్నమండ వీరాస్వామి, మైలా భాస్కరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో టన్ను రూ.5 వేల వరకు ఉండేదని నేడు సగానికి సగం ధర తగ్గిపోయిందని వాపోయారు.

ప్రభుత్వం ఆదుకోవాలి...

అనుకూల పరిస్థితులలో తయారైన ఉప్పును సరైన ధర పలికే వరకు నిల్వ చేసుకునే సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తే ఉప్పు రైతులు లాభం పొందే అవకాశం ఉంటుంది. ఎన్నికల వాగ్దానం మేరకు కోల్డ్ స్టోరేజ్‌ని నిర్మించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బ్యాంకు రుణ సౌకర్యం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. తమకు ఇతర రైతుల మాదిరి గుర్తించాలని కోరారు.

భారత్‌తో బంధం మరింత పటిష్ఠం: అమెరికా

వాషింగ్టన్: అమెరికా భాగస్వామ్య దేశాల్లో భారత్ కీలకమని, ఆ దేశంతో అత్యంత పటిష్ఠ భాగస్వామ్యం ఉన్నదని వాషింగ్టన్ తెలిపింది. దాదాపు నాలుగు బిలియన్ డాలర్ల విలువైన సాయుధ డ్రోన్లను న్యూఢిల్లీకి విక్రయించేందుకు అంగీకరించినట్లు అమెరికా కాంగ్రెస్‌కు వెల్లడించిన కొద్దిసేపట్లోనే ఈ ప్రకటన వెలువడింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ విలేకరులతో మాట్లాడుతూ కీలక ప్రయోజనాలను కాపాడుకునేందుకు భారత్‌తో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. అమెరికా నుంచి వెళుతున్న భారత రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధుతో మంచి అనుబంధం ఉందన్నారు. ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానాన్ని కాపాడే అంశాల్లో భారత్ పాత్ర కోసం కలిసి పనిచేశామని తెలిపారు. రెండు దేశాల విదేశాంగ మంత్రులు బ్లింకన్-జైశంకర్ కీలక అంశాల్లో సమిష్టి కృషి చేశారన్నారు. ఇప్పటికే ముఖ్యమైన అంశాలను చర్చించేందుకు తమ మంత్రి అనేక మార్లు న్యూఢిల్లీ వెళ్లినట్లు చెప్పారు. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర అంశంపై భారత్-అమెరికా మధ్య వివాదం ఏర్పడినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల విక్రయాలు నిలిపేసినట్లు వార్తలొచ్చాయి. బైడెన్ కార్యవర్గం మాత్రం ఈ డ్రోన్ల విక్రయానికి ఆమోదముద్ర వేసి దేశ కాంగ్రెస్‌కు నోటిఫై చేసింది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణ భద్రత సహకార సంస్థ తెలిపింది. ఈ డ్రోన్లను భారత్‌కు విక్రయించడం వల్ల అమెరికా విదేశాంగ విధానానికి ఊతం లభిస్తుంది. 'మా ప్రధాన రక్షణ భాగ స్వామి, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో శాంతి, ఆర్థిక పురోగతికి చాలా కీలకమైన భారత భద్రతను మెరుగుపరుస్తుంది' అని ఆ సంస్థ పేర్కొంది. భారత ప్రధాని మోదీ గతేడాది అమెరికాలో పర్యటించినప్పుడు ఈ ఒప్పందం జరిగింది. దీంతో వాషింగ్టన్ 31 డ్రోన్లు విక్రయించనుంది. అలాగే హెల్‌ఫైర్ క్షిపణులు, ఇతర నిఘా పరికరాలను కూడా భారత్‌కు చేరుకోనున్నాయి.

అమెరికా ప్రతీకారం

- ఇరాన్-సిరియాలో దాడులు: 18 మంది మృతి
- మా జోలికొస్తే ఇంతే: బైడెన్ హెచ్చరిక

వాషింగ్టన్: జోర్డాన్‌లో తమ క్యాంప్‌పై దాడికి ప్రతీకారంగా అమెరికా దాడులు మొదలు పెట్టింది. ఇరాక్, సిరియాలోని ఇరాన్ రెవల్యూషనరీ గార్డుల మద్దతు కలిగిన 85కుపైగా మిలీషియా స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 18 మంది మృతి చెందారు. ఇటీవల అమెరికా సైనిక క్యాంప్‌పై డ్రోన్ దాడి జరగడంతో ముగ్గురు సైనికులు మృతిచెందిన క్రమంలోనే ఇరాక్, సిరియాల్లో దీర్ఘశ్రేణి బీ-1 బాంబర్లతో అమెరికా విరుచుకుపడింది. 18 మంది ఇరాన్ మద్దతుగల మిలిటెంట్లు మరణించినట్లు బ్రిటన్‌లోని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ వెల్లడించింది. ఇరాక్‌లోనూ కొన్ని మరణాలు సంభవించినట్లు తెలుస్తోంది.అయితే ఉగ్రవాదుల కమాండ్ కంట్రోల్ ప్రధాన కేంద్రంతో పాటు ఇంటెలిజెన్స్ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు అమెరికా అధికారులు ప్రకటించారు. వారి రాకెట్లు, క్షిపణులు, డ్రోన్లు, ఆయుధ సామాగ్రి నిల్వల గోడౌన్లు, లాజిస్టిక్స్ సౌకర్యాలపై దాడులు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. అమెరికన్లకు హాని కలిగిస్తే ప్రతీకారం తప్పక తీర్చుకుంటామని తేల్చిచెప్పారు. పశ్చిమాసియా లేక ప్రపంచంలో ఎక్కడ కూడా ఘర్షణలు, యుద్ధాలు జరగాలని తాము కోరుకోవడం లేదని, తమ జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని జో బైడెన్ తెలిపారు. రాబోయే రోజుల్లో దాడులు మరింత భీకరమవు తాయని హెచ్చరించారు. ఈ దాడులను ఇరాక్ సైన్యం ఖండించింది. తమ సార్వభౌమత్వాన్ని అతిక్రమించినట్లు ఆరోపించింది. అయితే ఇరాక్ ప్రభుత్వానికి ముందే సమాచారం ఇచ్చామని, ఆ తర్వాతే వారి భూభాగంలో దాడులు చేశామని శ్వేతసౌధం జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ పేర్కొన్నారు.

అంతా అయోమయం!

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఒంగోలులో పరిణామాలు ఏదిశకు చేరతాయనేదీ ఆసక్తికరంగా మారింది.

'సిద్ధం' సభతో ప్రయాణికుల ఇక్కట్లు

ఏలూరు జిల్లా దెందులూరులో జరిగిన వైసీపీ సిద్ధం సభకు ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దెందులూరు నియోజకవర్గ కేంద్రంగా 110 ఎకరాల ప్రాంగణంలో సభను నిర్వహించారు. దీనికి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాలకు చెందిన 50 నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలు, శ్రేణులు తరలివెళ్లారు. ఇందు కోసం వైసీపీ ఎమ్మెల్యేలు, నేతల అధ్వర్యంలో ప్రత్యేకంగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, వాహనాలను ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత, సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వతప్రసాద్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సిద్ధం సభకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వారంతా టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం. ఇప్పటికే వైసీపీ తలపెట్టిన నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పులు, చేర్పుల్లో భాగంగా ఆ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను అధిష్టానం నిరాకరించింది. వారి నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయంగా ఇన్‌చార్జిలను నియమించారు. వైసీపీ ఆరు జాబితాల ద్వారా 65 మంది ఎమ్మెల్యే, 17 మంది ఎంపీ ఇన్‌చార్జిలను మార్పులు, చేర్పులు చేసింది. ఈ జాబితాల్లో ఊహించని విధంగా కొత్త వారికి చోట్లు దక్కాయి. సిట్టింగ్‌ల స్థానాలు గల్లంతయ్యాయి. సిట్టింగ్ ఎంపీలకు సైతం టికెట్లు ఇవ్వలేదు. ఈ పరిణామాలు వైసీపీపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మార్చిన నియోజకవర్గాల్లో కొత్త, పాత నేతల మధ్య విభేదాలు పొడచూపుతున్నాయి. వారిని సమన్వయం చేసేందుకు వైసీపీ ముఖ్యనేతలు తలలుపట్టుకుంటున్నారు. పైకి ఆ నేతలు సహకరిస్తామని, క్షేత్రస్థాయిలో వారి వర్గం నేతలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో కొత్తగా వచ్చిన ఇన్‌చార్జిల కార్యకలాపాలకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. సిద్ధం సభ కారణంగా నాలుగో నంబరు జాతీయ రహదారిపై వాహనాలను దారి మళ్లించారు. ఈ మూడు జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రోజు వారీ ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరువయ్యారు.

ప్రజలే నా సైన్యం

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తున్నామన్నారు. నాడు-నేడుతో పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలలో మార్పులు తీసుకువచ్చామన్నారు. తమ పాలనలో వెనుకబడిన వర్గాలకు 68 శాతం పదవులు కేటాయించామన్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్, రాష్ట్రంలో 15 వైద్య కళాశాలలు, నాలుగు పోర్టులు,10 షిప్పింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోకు విశ్వసనీయత తెచ్చామని, ప్రతి హామీని నెరవేర్చామన్నారు. రాబోయే ఎన్నికలు పేదల భవిష్యత్తును నిర్ణయించేవన్నారు. ప్రజలే తన స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. జరుగుతున్న మంచి కొనసాగాలంటే జగన్ పాలన ఉండాలన్నారు.

2024 ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేస్తే చంద్రగ్రహణాలు ఉండవన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసినా కూడా చెప్పుకునేందుకు ఏమీ లేనందునే చంద్రబాబు రాజకీయమంతా పొత్తులు, జిత్తులు, నక్కజిత్తులుగా సాగుతోందన్నారు. ఈ మధ్య చంద్రబాబుకు ఎన్టీరామారావు గుర్తుకొస్తున్నారని, వెన్నుపోటు పొడిచేదీ ఆయనే, మళ్లీ ఎన్నికలప్పుడు ఎన్టీఆర్‌ను గుర్తు తెచ్చుకునేదీ ఆయనేనని తెలిపారు. ఈ మధ్య కాలంలో తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటున్నారని, ప్రజలను కాదని, పార్టీలను, దత్తపుత్రుడిని పిలుస్తున్నాడని అన్నారు. కమలం పార్టీలో చేరి అక్కడ నా మనిషిగా రా కదలిరా అని వాళ్ల వదినమ్మను పిలుస్తున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అన్యాయంగా, అడ్డగోలుగా విడగొట్టిన రాష్ట్ర ద్రోహుల పార్టీని, వైఎస్సార్ మరణం తర్వాత ఆయన పేరును అన్యాయంగా ఛార్జిషీట్‌లో పెట్టిన నమ్మకద్రోహుల పార్టీని రా కదలిరా అని చంద్రబాబు పిలుస్తున్నాడని తెలిపారు. చంద్రబాబుకు పొత్తే లేకపోతే కనీసం 175 చోట్ల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేరన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ తమ కార్యకర్తలతో లంచాలు, పక్షపాతంతో కొద్ది మందికి మాత్రమే అన్న వివక్షతో జన్మభూమి కమిటీల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. అయితే మన ప్రభుత్వం వలంటీర వ్యవస్థ ద్వారా ఎక్కడా వివక్ష, లంచాలు లేకుండా ప్రతి ఇంటికీ మంచి చేయగలిగామన్నారు. వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 175కు 175 ఎమ్మెల్యేలని, 25 ఎంపీలకు 25 ఎంపీలని అన్నారు. మరో మూడు నెలల్లో మనందరి ప్రభుత్వం ఇంతకుమించిన ఉత్సాహంతో కొలువుదీరుతుందంటూ జగన్ ప్రసంగం ముగించారు.

ఈ బహిరంగ సభలో ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, తానేటి వనిత, ఇన్‌ఛార్జ్ మంత్రి పినిపే విశ్వరూప్, కొట్టు సత్యనారాయణ, శాసన సభ్యులు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, తెల్లం బాలరాజు, పుప్పాల వాసు బాబు, గ్రంధి శ్రీనివాస్, పేర్ని నాని తదితరులు పాల్గొన్నారు.

అడ్వాణీకి భారతరత్న



న్యూఢిల్లీ: దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను బీజేపీ కురువృద్ధుడు లాల్ కృష్ణ అద్వాణీకి ప్రదానం చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రధాని శనివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దేశాభివృద్ధిలో అద్వాణీ పాత్ర కీలకమని కొనియాడారు. 'ఎల్‌కే అద్వాణీజీకి భారతరత్న ప్రదానం చేయనున్న విషయాన్ని నేను పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. అద్వాణీతో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపాను. ఈ తరానికి చెందిన అత్యంత గౌరవనీయమైన రాజనీతిజ్ఞుల్లో ఒకరైన ఆయన... భారతదేశ అభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయం. అట్టడుగు స్థాయి నుంచి జీవితాన్ని ప్రారంభించి... ఉప ప్రధానిగా దేశానికి సేవ చేశారు. కేంద్ర హోంమంత్రిగా, సమాచార, ప్రసారశాఖ మంత్రిగా విశిష్టత చాటుకున్నారు. పార్లమెంటులో ఆయన అనుభవం మనకు ఆదర్శప్రాయం. అద్వాణీజీ సుదీర్ఘ రాజకీయ జీవితం నుంచి మనం ఎన్నో నేర్చుకోవచ్చు. జాతి ఐక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని పెంపొందించే దిశగా అసమాన కృషి చేశారు. ఆయనకు భారతరత్న ప్రదానం చేయడం నాకు చాలా భావోద్వేగమైన క్షణం. ఆయనతో కలిసి మాట్లాడే అవకాశం రావడం, ఆయన నుంచి నేర్చుకోవడం నా అదృష్టంగా భావిస్తా' అని ప్రధాని పేర్కొన్నారు. అద్వాణీకి భారతరత్న ప్రకటించడంపై బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు, ఇతర పార్టీల నేతలు సంతోషం వెలిబుచ్చారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు, తాను దేశానికి చేసిన సేవలు, తన సిద్ధాంతాలకు గుర్తింపుగానే భారతరత్న లభించిందని, దీనిని సగర్వంగా స్వీకరిస్తున్నానని అద్వాణీ పేర్కొన్నారు.

కాగా, అద్వాణీ 1927 నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాక్‌లో ఉంది)లో జన్మించారు. అక్కడే సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. 1941లో ఆర్‌ఎస్ఎస్‌లో చేరారు. పాకిస్తాన్‌లోని హైదరాబాద్‌లో గల డీజీ నేషనల్ కాలేజీలో న్యాయవిద్య పూర్తి చేశారు. 1970లో ఢిల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారు. 1976లో గుజరాత్ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లారు. 1977-80లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 1980లో జనతా పార్టీ ఓటమి పాలైన అనంతరం రాజ్యసభలో కొంతకాలం ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ఆ తర్వాత వాజ్‌పేయితో కలిసి 1980 ఏప్రిల్ 6న బీజేపీని స్థాపించారు. 1982లో మధ్యప్రదేశ్ నుంచి మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1999లో జరిగిన ఎన్నికల్లో గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి అద్వాణీ గెలిచారు. 2004 ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలవడంతో అద్వాణీ ప్రతిపక్ష నాయకుడిగా నియమితులయ్యారు. లోక్‌సభలో సుదీర్ఘకాలం ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఎన్నికలను ఎదుర్కొన్నారు. కానీ ఆ ఎన్నికల్లో కాషాయ పార్టీ ఓడిపోయింది. 2014లో మరోసారి గాంధీనగర్ నుంచి గెలుపొందిన అద్వాణీ... 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.

నా సేవలకు గుర్తింపు: అద్వాణి

న్యూఢిల్లీ: 'భారతరత్న' పురస్కారం లభించడంపై మాజీ ఉప ప్రధాని, బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వాణీ స్పందించారు. అత్యంత వినమ్రత, కృతజ్ఞతతో ప్రదానం చేసిన 'భారతరత్న'ని తాను గర్వంగా అంగీకరిస్తున్నానని అద్వాణి పేర్కొన్నారు. ఇది ఒక వ్యక్తిగా తనకు దక్కిన గౌరవం మాత్రమే కాదని, జీవితాంతం శక్తి మేరకు సేవ చేయడానికి తాను అవలంబించిన ఆదర్శాలు, సూత్రాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. 'నేను 14 సంవత్సరాల వయస్సులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో వలంటీర్‌గా చేరిన నాటి నుంచి జీవితంలో నాకు అప్పగించిన ప్రతి పనినీ నాకు ఇష్టమైన దేశం కోసం అంకితభావంతో, నిస్వార్థంగా సేవ చేశాను. 'భారత రత్న దక్కిన సందర్భంగా నేను సన్నిహితంగా పనిచేసిన ఇద్దరు వ్యక్తులు- పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిలను కృతజ్ఞతతో స్మరించుకుంటున్నాను. ప్రజాజీవితంలో, నా ప్రయాణంలో కలిసి పనిచేసిన లక్షలాది మంది నా పార్టీ కార్యకర్తలు, స్వయంసేవకులు, ఇతరులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా కుటుంబ సభ్యులందరికీ, ముఖ్యంగా నా ప్రియమైన భార్య కమలకు ధన్యవాదాలు. వీరంతా జీవితంలో నాకు అండదండగా నిలిచారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నాకు ఈ పురస్కారాన్ని అందించినందుకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. మన దేశం గొప్పతనం కీర్తి శిఖరాగ్రానికి పురోగమిస్తోంది' అని అద్వాణీ ఓ ప్రకటన విడుదల చేశారు.

పంజాబ్ గవర్నర్ ఆకస్మిక రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

పురోహిత్ తన రాజీనామా లేఖలో రాశారు. పెండింగ్ బిల్లులను ఆమోదించడంలో జాప్యంపై పంజాబ్‌లోని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి, పురోహిత్‌కు మధ్య ప్రతిష్టంభన ఏర్పడిన నేపథ్యంలో పురోహిత్ రాజీనామా చేశారు. నవంబరు 10, 2023న, పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన ఐదు బిల్లులకు ఆమోదం ఇవ్వడంలో జాప్యంపై పురోహిత్‌ను సుప్రీం కోర్టు నిలదీసింది. విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం గవర్నర్‌పై పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. 'మీరు నిప్పుతో ఆడుతున్నారు' అని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం, పురోహిత్ మధ్య ప్రతిష్టంభనపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఆ తర్వాత నవంబరు 23, 2023న... రాష్ట్రానికి నామమాత్రపు అధిపతి అయినందున గవర్నర్ 'బిల్లును సభ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచలేరు' అని సుప్రీం కోర్టు మరోసారి పేర్కొంది. శాసన బిల్లుల అమలును నిలిపివేసేందుకు రాష్ట్ర గవర్నర్ తమ రాజ్యాంగ అధికారాలను ఉపయోగించరాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోనూ పురోహిత్ భేటీ అయ్యారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయాన్ని నమోదు చేసి, మూడు పదవులను నిలబెట్టుకోవడంతో పాటు ప్రిసైడింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను రిగ్గింగ్ చేశారని ఆరోపించిన కాంగ్రెస్-ఆమ్ ఆద్మీ పార్టీ కూటమికి ఎదురుదెబ్బ తగిలిన కొద్ది రోజుల తర్వాత వారి సమావేశం జరిగింది. శుక్రవారం, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై విరుచుకుపడ్డారు. మేయర్ ఎన్నికలలో వారు 'ఓట్లు దొంగిలించారు' అని పేర్కొన్నారు.

సీట్ల సర్దుబాటుపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

మోదీ సర్కారు తీసుకొచ్చిందని, ఇది కార్మిక వర్గానికి అత్యంత ప్రమాదకరమని, ఇది వృత్తిపరమైన భద్రతకు నష్టదాయకమని, పనిదినాలను 8 నుండి 12 గంటలకు పెంచే ప్రతిపాదన ఇందులో ఉందని అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తమ హక్కులు కాపాడుకునేందుకు కార్మికులు, రైతులు పరస్పర మద్దతుగా ఐక్యంగా పోరాటం చేస్తున్నారన్నారు. జాతీయస్థాయిలో రైతు, కార్మిక సంఘాలు సంయుక్తగా సమావేశమవ్వడం దేశ చరిత్రలోనే ప్రథమమని, మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమాలు చేపట్టేందుకు సంయుక్త కార్యాచరణ రూపొందించాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని, బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 26, 27, 28 తేదీల్లో రాజ్‌భవన్‌ల ముందు ఆందోళనలు చేసినట్లు గుర్తుచేశారు. న్యాయమైన హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాలని కోరారు. బీజేపీది తుకుడే గ్యాంగ్ అని విమర్శించారు. కార్మిలకుకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సామాజిక, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అమర్‌జిత్ కౌర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి సభా సమరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఉన్నంతకాలం శాసనసభ సమావేశాలకు హాజరుకానని ప్రకటించిన విషయం తెలిసిందే. దానికనుగుణంగా ఆయన సోమవారం నుంచి 'రా కదలి రా' పేరుతో మళ్లీ జిల్లాల పర్యటనకు బయలుదేరుతున్నారు. దీంతో టీడీపీ శాసనసభ్యులు, మండలి సభ్యులు పరిమితంగా సమావేశాలకు హాజరుకానున్నారు. అధికారపార్టీ చేసే విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు.

సభలోపల స్పీకర్ మాట్లాడే అవకాశం ఇవ్వని పక్షంలో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించడం ద్వారా అధికార పార్టీ ఎత్తుగడలను ఎండగట్టాలని యోచిస్తున్నారు. తొలిరోజు ఉభయసభలనుద్దేశించి సాగే గవర్నర్ ఉపన్యాసం అధికారపార్టీకి అనుకూలంగా, పూర్తి ఏకపక్షంగా సాగే అవకాశం ఉన్నందున, దానికి తగినట్లుగా ప్రతిస్పందించాలనే యోచనలో టీడీపీ ఉంది.

తహసీల్దార్ దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

దుండగుల చర్యపై సర్వత్ర ఆందోళన వ్యక్తమౌతోంది. వివరాల్లోకి వెళితే.. విశాఖ జిల్లా మధురవాడలోని కొమ్మాదిలో అపార్ట్‌మెంట్ గేటు వద్దే తహసీల్దార్ దారుణ హత్యకు గురయ్యాడు. విశాఖ రూరల్ (చినగదిలి) తహసీల్దార్‌గా ఉన్న సనపల రమణయ్య గురువారం విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. మొదటి రోజు శుక్రవారం విధులకు హాజరై రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. రాత్రి సుమారు 10.15 గంటల సమయంలో ఫోన్ రావడంతో ఫ్లాట్ నుంచి కిందకు వచ్చిన ఆయన ఓ వ్యక్తితో పది నిమిషాల పాటు సీరియస్‌గా సంభాషణ జరిగినట్టు సీసీ ఫుటేజ్‌లో వెల్లడైంది.

కొమ్మాదిలో ఎస్‌టిబిఎల్ సినీ థియేటర్ వెనుక ఉన్న చరణ్ క్యాస్టల్స్ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో నివాసం ఉంటున్నారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ఇనుపరాడ్‌తో తహసీల్దార్‌పై ఒక్కసారిగా దాడి చేసి పరారయ్యాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే రమణయ్య కుప్పకూలిపోయాడు. గమనించిన వాచ్‌మాన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో మృతి చెందాడు. ఉదయం ఘటన స్థలానికి పోలీస్ కమిషనర్ రవిశంకర్ చేరుకుని, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో పరిశీలించారు.

తహసిల్దార్ రమణయ్యకు భార్య, ఓ పాప, బాబు. అతడి సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం దిమ్మిలాడ గ్రామం. కాగా, విధుల్లో చేరి పదేళ్లు అవుతుంది. డిప్యూటీ తహసిల్దార్, తహసిల్దార్, కలెక్టరేట్లో ఏవో గా విధులు నిర్వర్తించారు. వజ్రపు కొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ చినగదిలి మండలాల్లో ఎమ్మార్వోగా పనిచేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. దాడికి గల కారణాలపై ఆరా తీసున్నారు. మరోవైపు తహసీల్దార్ హత్యతో రెవెన్యూ యంత్రాంగం ఉలిక్కిపడింది. అధికారులకు రక్షణ కల్పించాలని, రాత్రి సమయంలో ఇంటి కి వచ్చి చంపడం దారుణమని రెవెన్యూ అసోసియేషన్ నేతలు మండిపడ్డారు. విశాఖ భూముల ధరలు పెరగడం, ఎమ్మార్వోపై వత్తిడి తేవడం, ప్రభుత్వం ఉద్యోగులకు మెసేజ్ పంపడం పన్నాగంగా కనిపిస్తుందన్నారు. నిందితులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మృతదేహానికి నివాళులర్పించారు.

నిందితుడిని గుర్తించాం: సీపీ

ఎమ్మార్వో రమణయ్యను హత్య చేసిన వ్యక్తిని గుర్తించామని పోలీస్ కమిషనర్ రవిశంకర్ ప్రకటించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడిని పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితుడు విమానం ఎక్కి వెళ్లాడని, టికెట్ బుక్ చేసిన ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. నిందితుడిపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనేది పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడు చాలాసార్లు ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లినట్లు గుర్తించామన్నాడు.

భూ దాహంతోనే కిడ్నాప్‌లు, హత్యలు..

విశాఖ నగర శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకడంతో కబ్జాదారులు బరితెగించి అధికారులపై బెదిరింపులకు దిగడం, హత్యకు పాల్పడడం శాంతి భద్రతలకు తీవ్ర విఘాతమేనని విశాఖ వాసుల అభిప్రాయపడుతున్నారు. కార్యనిర్వాహక రాజధాని పేరుతో వైసీపీ పభుత్వం భూ దోపిడీకి శ్రీకారం చుట్టిందని విపక్షాలు మండిపడుతున్నాయి. శివారు ప్రాంతాల్లో భూ కబ్జాలు పెచ్చిమీరిపోతున్న నేపథ్యంలో రమణయ్య కొంతమంది కబ్జాదారులను హెచ్చరించిన సంఘటనలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అండతో కబ్జాల జోలికి వస్తే అంతు చూస్తామని కొంతమంది కబ్జారాయుళ్లు బెదిరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు ఒక తహసీల్దార్‌నే హత్యచేసిన దుండగుల చర్యపై వివిధ రాజకీయ పార్టీలు మండిపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి అనడానికి తహసీల్దార్ హత్య ఓ నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో తీవ్ర అశాంతి నెలకొందని, అధికారుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. కేజీహెచ్ మార్చురీ వద్ద శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. విశాఖలో నేర సంస్కృతి వైసీపీ పాలనలోనే అధికమైందని, శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు. కార్యనిర్వాహక రాజధాని అయితే విశాఖలో సామాన్యులు జీవనం సాగించలేరేమోనని అనుమానాన్ని వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోకనాథం, జనసేన విశాఖ అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్.. నిందితులను కఠినంగా శిక్షించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

పేదల ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్లు: మంత్రి ధర్మాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నవరత్నాల పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాలు పొందిన 31.65 లక్షల మంది లబ్ధిదారులు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయించు కోవాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. బొడ్డేపల్లి రాజ గోపాలరావు వంశధార ప్రాజెక్టు సర్కిల్ కార్యాల యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ, లబ్ధిదారులు ఒరిజినల్ పట్టా, ఆధార్‌ను ఆయా సచివాలయాల్లో అందజేసి ఒక్క రూపాయి కూడా ఫీజు చెల్లించకుండానే రిజిస్ట్రేషన్ సేవలు పొందాలని సూచించారు. పదేళ్ల తర్వాత సర్వ హక్కులు పొందేలా ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరింపు చేసిందని తెలిపారు. ప్రభుత్వ జోక్యం లేకుండానే నిరుపేదలకు నేరుగా ఆ స్థలాలను అమ్ముకోవడానికీ, ఇతర ప్రయోజనాలకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు.

రీ సర్వేపై ఆందోళన వద్దు: నీతి అయోగ్ సూచనల మేరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కోసం ప్రజలు, ప్రజా సంఘాల నుంచి అభ్యంతరాలను కోరుతూ త్వరలోనే ఒక వెబ్‌సైట్ ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న రీ సర్వేపై ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన చట్టాన్ని తీసుకువస్తామని వివరించారు. రాష్ట్రంలో 4,000 పైచిలుకు గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని చెప్పారు.

గొట్టా వద్ద ఎత్తిపోతలను ఏడాదిలో పూర్తి చేస్తాం

వంశధార నదిలో ఆంధ్రప్రదేశ్ వాటాగా ఉన్న 19 టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో ప్రభుత్వం గొట్టా బ్యారేజ్ వద్ద ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేస్తుందని మంత్రి ధర్మాన అన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణ పనులతో సంబంధం లేకుండా ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు తక్షణ పరిష్కారంగా గ్రావిటీకి వ్యతిరేకంగా ఎత్తిపోతల పనులను ఏడాదిలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. అదే పూర్తయితే శ్రీకాకుళం జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు.

తహసీల్దార్ హత్య దారుణం: నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వైసీపీ నేతల అవినీతి, అక్రమాలు, వేధింపులతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాగిస్తున్న అరాచక పాలనకు వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు బలయ్యారని, ఇవన్నీ జగన్ సర్కారు చేసిన హత్యలేనని ఆరోపించారు. అధికారం కోసం సొంత బాబాయ్‌ని బలిచ్చిన జగన్ గ్యాంగ్ తమ దోపిడీకి సహకరించని ప్రభుత్వ ఉద్యోగుల అడ్డు తొలగించుకుంటున్నారని మండిపడ్డారు. విశాఖ జిల్లాలో వైసీపీ భూ అక్రమాలకు సహకరించలేదని ఆ పార్టీ నేతలే తహసీల్దార్ సనపల రమణయ్యను అత్యంత దారుణంగా చంపేయడం అధికారుల ప్రాణాలకు రక్షణలేదని తేలిపోయిందన్నారు. బాపట్ల జిల్లా చావలి ఆర్బీకేలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తున్న బి. పూజిత ఆత్మహత్యకు కారణం వైసీపీ నేతలు ఎరువులు ఎత్తికెళ్లిపోవడమేనన్నారు. విజయనగరం జిల్లా రాజాంలో పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి వల్లూరు రామకృష్ణను మాయచేసి వైసీపీ నేతలు సిమెంటు ఎత్తుకెళ్లారన్నారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, నేతల బెదిరింపులతో కార్యాలయంలోనే ఉరివేసుకుని తనువు చాలించారన్నారు. సీఎం జగన్‌కు తన ఆర్థిక భద్రతపై ఉన్న శ్రద్ధ శాంతి భద్రతలపై లేకపోవటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో విమర్శించారు. తహసీల్దార్ హత్య దుర్మార్గమన్నారు.

అద్వాణీకి టీడీపీ, జనసేన అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : బీజేపీ అగ్రనేత, భారతరత్న అవార్డు గ్రహీత ఎల్.కె.అద్వాణీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి, నిబద్ధతతో పనిచేసిన వారికి గౌరవం దక్కుతుందనడానికి ఇదే ఉదాహరణ అన్నారు. అద్వాణీ తన రాజకీయ రంగ ప్రవేశం నుంచి క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగేవరకు హుందాగా రాజకీయాలు చేశారన్నారు. కేంద్ర హోంమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన దేశ ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివన్నారు. 2004లో ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

'భారతరత్న' అవార్డుకు ఎంపికైన అద్వాణీకి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నారని ఎక్స్(ట్విట్టర్) వేదికగా కొనియాడారు. అద్వాణీ పేరు వినగానే రథయాత్ర గుర్తుకు వస్తుందని, అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం చేపట్టిన యాత్ర భారత రాజకీయ, పాలన వ్యవస్థల్లో కీలక మలుపును తీసుకువచ్చిందని గుర్తుచేశారు. అయోధ్యలో శ్రీరాముని ఆలయం నిర్మితమైన వేళ అద్వాణీని భారతరత్న పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందదాయకమని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పంట రుణాలు మాఫీ చేయండి

8న కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళనకు రైతు సంఘాల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రైతులు, కౌలురైతులకు రూ.రెండు లక్షల మేర అన్ని రకాల పంట రుణాలు మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కె.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో శనివారం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరువు, తుఫాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని, ప్రతి ఎకరాకు రూ. 15 వేల సాయం అందించాలని కోరుతూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌లు, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగం ఆత్మహత్యల్లో దేశంలో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉందని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందని వివరించారు. ప్రతి రైతు కుటుంబం రూ.2.45 లక్షలు అప్పుల భారం మోస్తోందన్నారు. రూ. రెండు లక్షల వరకు పంట రుణాలను రద్దు చేయాలని సమావేశం తీర్మానం చేసింది.

బడ్జెట్ ప్రతుల దహనం

దాసరిభవన్ నుంచి రైతు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కారల్‌మార్క్స్ విగ్రహం కూడలిలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని నిరసించారు. ఎ. కాటమయ్య, వి. హనుమారెడ్డి, కె. జగన్నాథం, పి. జములయ్య, దేగా ప్రభాకర్, బుద్ది రమేష్, పి.పంపన్నగౌడ్, తిమ్మయ్య, దొంత కృష్ణ, మేకల డేవిడ్, చిన్న కొండయ్య, విఠల్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ జయప్రదం చేయండి

రవీంద్రనాథ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా చేపట్టే గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపుచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో జరుగు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు ప్రజాతంత్ర శక్తులు, కార్మికసంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మోదీ ప్రభుత్వ విధానాలపై దేశవ్యాప్తంగా ఇప్పటికే అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించామని తెలిపారు. నల్లచట్టాలు ఉపసంహరిస్తామని, రైతులపై కేసులు ఎత్తివేస్తామన్న హామీని ఏడాది గడిచినా ప్రధాని మోదీ అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మోసగిస్తోందని విమర్శించారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్తు, అటవీ సంపద, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మికచట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లు తెచ్చిందన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంట్ ముందు పెట్టిందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగా అదానీ, అంబానీ ప్రపంచకుబేరుల జాబితాలో చేరగా...రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు.

సామాజిక న్యాయానికి తూట్లు

కేంద్ర బడ్జెట్‌పై కరవది సుబ్బారావు, పి.చిట్టిబాబు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్ర బడ్జెట్‌లో సామాజిక న్యాయానికి తూట్లు పొడిచారని, దళితులు, గిరిజనులకు తక్కువ నిధులు కేటాయించి మోసం చేశారని, తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో షెడ్యూల్ కులాల సంక్షేమానికి రూ,1,65,598 కోట్లు, షెడ్యూల్ తెగల కోసం రూ.1,21,023 కోట్లు కేటాయిం చిందని తెలిపారు. అయితే నేరుగా దళితులకు రూ.44,282 కోట్లు, ఆదివాసీలకు రూ.36,212 కోట్లు మాత్రమే ఉపయోగపడతాయన్నారు. అత్యధిక భాగం సాధారణ పథకాలకు కేటాయిం చడం వలన సమానత్వం అనేది లేదన్నారు. 2024 జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర బడ్జెట్ ఎస్సీ, ఎస్టీలకు కేటాయించలేదన్నారు. దళితుల పట్ల పాలకులు చిన్నచూపు చూస్తూ, సామాజిక న్యాయం అనేది మాటలకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే చాలా ఇబ్బందులు తప్పవని అన్నారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీ మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారని, వీరికి నష్టపరిహారం నిధులు కేటాయించలేదని, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.70 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. దళితుల బడ్జెట్ కోసం కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన ఎస్సీ, ఎస్టీలు ఉన్నత విద్యకు విదేశీ విద్యకు దూరమవుతున్నారని, ఈ బడ్జెట్‌ను సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శీరంశెట్టి నాగేంద్రరావు, టి.అప్పారావు, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజా స్వామ్య పరి రక్షణ, సుపరిపాలన కోసం ఆంధ్రప్రదేశ్ పౌరసమాజం నడుం బిగించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ పిలుపునిచ్చింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో 'ఓటు వేద్దాం - ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేద్దాం' నినాదంతో ఆదివారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ 'వెన్యూ'లో 'ప్రజాస్వామ్య పరిరక్షణ సమావేశం' జరగబోతోందని తెలిపింది. దీనిని జయంప్రదం చేయాలని కోరింది.

రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన సంస్థలు పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా జీవితంలో గుణాత్మక మార్పులు తెచ్చేందుకు ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ చేస్తున్న కృషికి పౌరసమాజం సహకరించాలని పేర్కొంది.

గ్రూప్‌లు, డీఎస్సీ వయోపరిమితి పెంచాలి

ఏపీ నిరుద్యోగ జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీ ఎస్సీ గ్రూప్, డీఎస్సీ ఉద్యోగాల వయో పరిమితిని జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 47 సంవత్సరాలకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జనరల్ కేటగిరి అభ్యర్థులకు పెంచితే రిజర్వేషన్ వర్గాలకు అదనంగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పోస్టుల సంఖ్య పెంచడానికిగాను అన్ని ఖాళీలు భర్తీ చేయాలన్నారు. పోలీస్ శాఖలో 26 వేల ఉద్యోగాలు, డిజిటల్ గ్రంథాలయ శాఖ ఉద్యోగాలతో పాటు అన్ని విభాగాలలో అవసరమైన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, గ్రామసచివాలయాల ఉద్యోగ నోటి ఫికేషన్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది జనవరి 22న కానిస్టేబుల్ రాత పరీక్ష రాసి సమయం సరిపోక, ప్రశ్నలోపాలతో అర్హత కోల్పోయిన అభ్యర్థులకు గత సచివాలయం తరహాలో ఐదు గ్రేస్ మార్కులు వేసి పరీక్షలకు అనుమతించా లన్నారు. దీనివల్ల మరో మూడు లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు వెళ్లే అవకాశం వస్తుందన్నారు. ఆర్థికశాఖ ఆమోదం పొందిన 23 డిగ్రీ కాలేజ్ లైబ్రరీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, బీఈడీ, పీఈటీ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు లేకుండా మొత్తంగా రాత పరీక్ష ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.

మంగంపేట 'దోపిడీ'

- గనులు ప్రభుత్వానివా? వైసీపీవా?
- సంస్థకు డబ్బు ఎగవేసిన వారిపై కేసులు నమోదు చేయాలి
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-రాయచోటి : ఆంధ్ర ప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థకు చెందిన మంగంపేటలో బెరైటీస్ మైన్‌లోజరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఆర్థిక నేరగాళ్లపై, సంస్థ యాజమాన్యంపై, ప్రధానంగా వైసీపీకి గనులు దోచిపెట్టిన మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య శనివారం డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలో ఉన్న మంగంపేట గనులపై కన్నేసిన వైసీపీ నేతలు ఏపీఎండీసీని తన చేతిలో పెట్టుకోవడానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా వెంకట్ రెడ్డిని నియమించుకొని కోట్ల రూపాయలు లూటీ చేశారని విమర్శించారు. ప్రత్యక్ష వేలంలో పాల్గొనకుండా, టెండర్లలో బిడ్డింగ్ వేయకుండా రాజకీయ ఒత్తిళ్లతో కోట్ల రూపాయల విలువ చేసే బెరైటీస్‌ను దోచేశారని, ఇది ఏకంగా రూ.200 కోట్ల పైనే ఉందన్నారు. ఈ దోపిడీలో రూ.100 కోట్ల మేర ఇప్పటివరకు లెక్కతేలినప్పటికీ, ఏపీఎండీసీకి రూపాయి చెల్లించకుండా బెరైటీస్‌ను తీసుకెళ్లి దేశవిదేశాలకు అమ్ముకొని వైసీపీ నాయకులు కోట్లకు పడగెత్తారని, సంస్థకు మాత్రం డబ్బులు చెల్లించలేదన్నారు. ఏళ్లు గడుస్తున్నా సొమ్ము రాబట్టేందుకు సంస్థ కనీసం ప్రయత్నం చెయ్యకపోవడం చూస్తుంటే మంగంపేట గనుల ద్వారా వైసీపీ నేతలను ఆర్థికంగా బలవంతులను చేయడానికి వెంకట్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు. కడపకు చెందిన అధికార పార్టీ నేత 167 మంది బినామీ రైతులను చూపి 32 వేల టన్నుల బెరైటీస్ తరలించుకుపోయాడని, ఇదే నేత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ముందుపెట్టి బెరైటీస్‌ను అక్రమంగా దోచుకున్నాడని, దీని విలువ సుమారు రూ.20 కోట్లపైనే ఉంటుందన్నారు. కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత డీకేటీ భూములను పట్టా భూములుగా చూపించి వాటిని గ్యారంటీగా పెట్టి రూ.42 కోట్లకు పైనే బెరైటీస్ తీసుకొని ఏళ్లు గడుస్తున్నా ఆ నేత ఏపీఎండీసీకి రూపాయి చెల్లించలేదన్నారు. పైగా డీకేటీ పట్టా భూముల నేది చూడకుండా మైనింగ్ ఇచ్చారంటే సంస్థ యాజమాన్యం ఏ స్థితిలో ఉందో అర్థమవుతోందని తెలిపారు. మరోవైపు, కడప జిల్లాకే చెందిన ప్రగతి మినరల్స్ 54,655 మెట్రిక్ టన్నుల బెరైటీస్ అక్రమ రవాణాకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరిపి ప్రగతి మినరల్స్ నుంచి రూ.26.33 కోట్లు రికవరీ చేయాలని గనుల శాఖకు సిఫారసు చేసినా పట్టించుకోలేదన్నారు. కడప జిల్లా నేత కుటుంబానికి చెందిన ఐబీసీ లిమిటెడ్ కంపెనీ ఏపీఎండీసీ నుంచి కొన్నేళ్లలో నాణ్యమైన బెరైటీస్ తీసుకుందని, రూ.39 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఆ సంస్థ ఇప్పటి వరకు రూ.4 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. దీనిపై వడ్డీ, అపరాధ రుసుము, జీఎస్టీ అదనమని, ఇంకా రూ.33.59 కోట్లు చెల్లించాలన్నారు. ఏపీఎండీసీతో జాయింట్ వెంచర్ కింద ఐబీసీ లిమిటెడ్ ఆంధ్రా బెరైట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఏబీసీపీఎల్) అనే కంపెనీని ఏర్పాటు చేశారన్నారు. ఇందులో ఏపీఎండీసీకి వాటా 11 శాతం ఉండగా, 89 శాతం ఐబీసీ లిమిటెడ్‌కు ఉందని తెలిపారు. కందుల రాజమోహన్‌రెడ్డికి చెందిన ఆ సంస్థ రూ.33.59 కోట్ల బకాయి పడిందన్నారు. రెవెన్యూ రికవరీ కింద ఆస్తుల స్వాధీనం, ఇతర అవకాశాలు ఉన్నా ఏపీఎండీసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఈశ్వరయ్య విమర్శించారు. అయితే ఏబీసీపీఎల్ 2015 నుంచే పని చేయడం లేదన్నారు. కానీ ఆ సంస్థకు సీ,డీ గ్రేడ్ బెరైటీస్ సరఫరా చేసేందుకు 2008 సంవత్సరంలో జరిగిన ఒప్పంద ప్రకారం ఇప్పటికీ ఆ సంస్థ పనిచేయకపోయినా ఒక టన్నుకు రూ.వెయ్యిగా ఉందని వివరించారు. 2008లో జరిగిన ఒప్పందం ప్రకారం నష్టపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం కిషన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.4.82 కోట్లు, ఫ్రెస్ మినరల్స్ రూ.72.15 లక్షలు, హరిణి ఇండస్ట్రీస్ రూ.75.80 లక్షలు, పావనీ అండ్ కో రూ.27.53 కోట్ల చొప్పున బకాయి పడ్డాయని తెలిపారు. సంస్థ యాజమాన్యం, ప్రధానంగా మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఆ బకాయిలను వసూలు చేయకుండా వైసీపీకి దోచిపెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. దీంతో పాటు ఎంప్రద మినరల్స్‌కు మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి బంధువు కావడంతో ఇచ్చిన రాయల్టీ కంటే ఎక్కువగా దోచిపెట్టారన్నారు. వీటిన్నింటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆర్థిక నేరగాళ్లపై, వారికి తోడ్పాటు అందించిన మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, తద్వారా సంస్థను, కార్మికులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

అరెస్టు అక్రమం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దెందులూరులో వైసీపీ సిద్ధం సభకు సీఎం జగన్ హాజరవుతున్న నేపథ్యంలో ఏలూరులో సీపీఎం నాయకులను హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. దీనికి కారకులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్నిపార్టీలకు రాజ్యాంగ రీత్యా సమానమైన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక పార్టీ సభ పెట్టుకుంటే మరో పార్టీ నాయకులను అరెస్టు చేయడమంటే అది నిరంకుశ రాజ్యమవుతుందని ధ్వజమెత్తారు. ఎన్నికలు రానున్న తరుణంలో ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం

హేమచంద్రారెడ్డి వెల్లడి

విశాలాంధ్ర -విశాఖ సిటీ: యువత సామర్థ్యంపై తమకు అపార నమ్మకం ఉందని, ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సాహమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమ చంద్రారెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో నిర్వ హించిన 'ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ డైలాగ్' సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ఆయన శనివారం ప్రసంగించారు. రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. 12 లక్షల మంది విద్యా ర్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నామన్నారు. గతంలో 7 వేల రూపాయలు ఉన్న స్కాలర్‌షిప్ రూ.20 వేలకు పెంచామన్నారు. 2018లో ఇంజనీరిగ్‌లో 85 వేలమంది చేరారని, నేడు 1.25 లక్షల మంది చదువుతున్నారన్నారు. విద్యార్థుల చేరిక నిష్పత్తిలో జాతీయ సగటును ఏపీ అధిగమించిందన్నారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ సామాజిక భద్రత కల్పించే విధంగా నగదు నేరుగా లబ్ధిదారులకు అందించడం సంతోషమన్నారు. కోవిడ్ సమయంలో రాష్ట్రంలో ఆకలిచావులు లేకపోవడానికి ఇదే కారణమన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి...యువత అవకాశాలు, ప్రస్తుత విద్యా విధానం గురించి వివరించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

నేవీలోకి ఐఎన్ఎస్ సంధాయక్

స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తొలి సర్వే నౌక జాతికి అంకితమిచ్చిన రాజ్‌నాథ్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, హిందూ మహాసముద్రంలో స్వేచ్ఛా వాణిజ్య సాధనలో భారత నావికా దళం కీలకపాత్ర పోషిస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సముద్ర పైరసీ, స్మగ్లింగ్‌ను ఉపేక్షించరాదని నవభారతం ప్రతిజ్ఞ బూనిందని చెప్పారు. దేశ తొలి సర్వే వెసెల్ లార్జ్ (ఎస్‌వీఎల్) నౌక 'ఐఎన్ఎస్ సంధాయక్' శనివారం నావికా దళ అమ్ములపొదికి చేరింది. 'ఐఎన్ఎస్ సంధాయక్' సర్వే నౌకను రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితమిచ్చారు. తూర్పు నౌకాదళ ముఖ్య కార్యాలయం అధ్వర్యంలో విశాఖలోని నేవల్ డాక్ యాడ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ భారతీయ నౌకలకే కాకుండా మిత్రదేశాల నౌకలకూ నావికా దళం రక్షణ కల్పిస్తుందని అభినందించారు. నావికా దళంలో శాంతిభద్రతలకు, ఇండో- పసిఫిక్‌లో సూపర్‌పవర్‌గా భారత్ పాత్రకు ఐఎన్ఎస్ సంధాయక్ దోహదమవు తుందని తెలిపారు. సముద్ర జలాల్లో ఎనిమిది వేల నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న దొంగలను గుర్తించడంలో ఐఎన్ఎస్ సంధాయక్ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ నౌక జలప్రవేశం సంతోషకరమన్నారు. సముద్రాల గురించి సమాచారాన్ని సేకరించడానికి ఐఎన్ఎస్ సంధాయక్ దోహదమవు తుందని తెలిపారు. 'సముద్రం చాలా విశాలమైనది. అంతం లేనిది. ఎంత ఎక్కువగా అన్వేషిస్తే అంత ఎక్కువ విజ్ఞనం లభిస్తుంది. శక్తిమంతమైన దేశంగా మనల్ని నిలుపుతుంది. మన ఉద్దేశాల సాధనకు మరింత చేరువయ్యేందుకు దోహదమవుతుంది' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో నౌక దళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్, తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి, వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్క, విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, నేవీ ఫ్లాగ్ ఆఫీసర్లు, రియర్ అడ్మిరల్ పాల్గొన్నారు. అంతకుముందు నావికా దళ గౌరవ వందనాన్ని రక్షణమంత్రి స్వీకరించారు.

ఐఎన్ఎస్ సంధాయక్ విశిష్ఠ

హైడ్రోగ్రాఫిక్ సర్వే కోసం రక్షణశాఖ ఆదేశాలతో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని గార్డెన్‌రీచ్ షిప్ బిల్డింగ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ 'ఐఎన్ఎస్ సంధాయక్'ను నిర్మించింది. 2019లో నిర్మాణం మొదలు కాగా 2021 డిసెంబరు 5న పనులు పూర్తి చేశారు. ఇది 3,800 టన్నుల సామర్థ్యంతో 110 మీటర్ల పొడవుంది. హెలిపాడ్, సర్వే సాంకేతిక పరికరాలు, రెండు డీజిల్ యంత్రాలు అమర్చారు. సంధాయక్ నౌకకు కమాండింగ్ అధికారిగా కెప్టెన్ ఆర్ఎం థామస్ వ్యవహరించనున్నారు. 18 నాటికల్ మైళ్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది. ఈ నౌక 3.2 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. దేశీయ పరిజ్ఞానంతో ఇది రూపుదిద్దుకుంది. 2023 డిసెంబరులో భారత్ నౌకాదళానికి ఇది చేరుకుంది. అనంతరం షీఫెస్, హార్బర్ పేస్ ట్రయల్స్ పూర్తి చేశారు. సముద్ర తీరప్రాంతంలోని అతి సూక్ష్మ సమాచారాన్ని మ్యాప్ రూపంలో అందించగలిగే విధంగా దీనిని తయారు చేశారు. సముద్ర జలాల సర్వే మ్యాపింగ్ కోసం అవసరమైన మల్టీ బీమ్ ఎకో అండర్ వాటర్ సదుపాయం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.2589/2023/ఇ1 తేది: 03-02-2024

నిట్ నెం.53/ఇ.టి.ఓ/2023-24

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధుల క్రింద మరియు అమృత్-2.0 నిధుల క్రింద మొత్తము 06 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 06 నెం.లు	అంచనా వ్యయము రూ.116.75 లక్షలు
పని నెం. 01 నుండి 05 లకు :	
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.04-02-2024 ఉదయము గం.11.00ని.ల నుండి
2. టెండర్లు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.12-02-2024 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.12-02-2024 మధ్యాహ్నము గం.2.00 ని.లకు
పని నెం. 06 నకు :	
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.04-02-2024 ఉదయము గం.11.00ని.ల నుండి
2. టెండర్లు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.07-02-2024 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.07-02-2024 మధ్యాహ్నము గం.2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

సం/- వి.నిర్మల్ కుమార్, కమిషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సంపాదకీయం

ఎందుకింత చిన్నచూపు?

విశాఖ రైల్వే జోన్‌పై కేంద్ర రైల్వేశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలకు ఏపీ ప్రజలు అవాక్కయ్యారు. విశాఖపట్నంలో రైల్వేజోనల్ కార్యాలయం ఏర్పాటుకు 53 ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం అప్పగించకపోవడం వల్లనే రైల్వేజోన్ జాప్యమవుతున్నదని మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రకటించి మూడు రోజులవుతున్నా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ఉలుకూలేదు పలుకూలేదు. ఈ సమస్యపై లోతుగా అధ్యయనం చేస్తే అసలు విషయం బోధపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ దొంగనాటకాలు ఆడుతున్నాయని తేలింది. విశాఖ రైల్వేజోన్ డిమాండ్ దశాబ్దాలనాటిది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత జోన్ ఏర్పాటు లాంఛనప్రాయమేనని స్థానికులు కలలుకన్నారు. ఆ కలలు కల్లలేనని రుజువై, పదేళ్ల దాటినా ఇంకా కళ్లుతెరవక పోవడం బాధాకరం. గడిచిన పది సంవత్సరాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్లో ఒక్కటి అమలైనా ఆంధ్రా ప్రజలు పండగ చేసుకునేవాళ్లే. ఎందుకోగానీ, మొదట్నించీ బీజేపీకి ఏపీ అంటే చులకనభావం, చిన్నచూపు. ఆంధ్రాలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రావడమనేది సాధ్యం కాదని అధిష్ఠానానికి అర్థమైపోయి ఉండవచ్చు. లేదా ఏపీలో ఏ పార్టీ గెలిచినా అది తమ చెప్పులు మోస్తుందన్న భ్రమ మోదీషాకు ఉండిఉండవచ్చు. ఎందుకంటే, రాష్ట్ర విభజన తర్వాత వారనుకున్నట్టే జరిగింది. ఆనాడు చంద్రబాబునాయుడు, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్క హామీని నెరవేర్చుకునే దమ్ము, ధైర్యం తమకు లేదని నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ దృష్టిలో ఆంధ్రప్రదేశ్ అనేది ఒక 'రాజుగారి కోడిపందేలాట'లా మారింది. 'మన చెరువు కానప్పుడు అది ఎండితే ఎంత? నిండితే ఎంత?' అన్న ధోరణిలో మోదీషా ఏపీ నేతలతో 'మనో క్రీడ' ఆడుతూ ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (2014) ప్రకారం ఏపీకి రావాల్సినవి ఇంకా రాకపోగా, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలూ నెరవేరలేదు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ చేసిన ఒత్తిడి మేరకే యూపీఏ-2 ప్రభుత్వం విభజన సమయంలో నష్టపోయిన ఏపీకి కొన్ని హామీలిచ్చింది. ఆ తర్వాత అదే బీజేపీ అధికారంలోకి వచ్చింది. నాడు ప్రగల్భాలు పలికిన నేత మోదీ ఏకంగా ప్రధానమంత్రే అయ్యారు. 'వాసనలు బాగా వంటబట్టిన తర్వాత ముక్కు ఎందుకు? ముక్క ఎందుకు?' అన్న చందంగా మోదీ ఏపీ దస్త్రాలను చుట్టచుట్టి చెత్తబుట్టలోకి విసిరేశారు.

29 రాష్ట్రాలకు గాను 4 రాష్ట్రాల్లో ఓటర్లతో బీజేపీకి ఏ మాత్రం పనిలేదు. అందులో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఈ భిన్నమైన పరిస్థితిని కాషాయపార్టీ తనకు అనుకూలంగా మలచుకున్నది. బీజేపీ మూడోసారి అధికారంలోకి రావాలంటే ఆంధ్రప్రదేశ్ ఓటర్లతో నిమిత్తంలేదన్న నిజాన్ని ఆకళింపు చేసుకున్న అధిష్ఠానం ఈ రాష్ట్రంవైపు తొంగిచూడనైనా చూడటం మానేసింది. కేంద్రాన్ని కించిత్‌మాట అన్నా మోదీషా కొరడా ఝుళిపిస్తారన్న భయం వైసీపీ, టీడీపీలకు మొదట్నించీ కాస్త ఎక్కువే. పైగా కేసుల ఊబిలో కూరుకుపోయిన ఉభయపార్టీలకూ మోదీని నిలదీయాలంటే మైనస్ వంద డిగ్రీల చలిలో ఉన్నంత వణుకు. వైసీపీ, టీడీపీ జంతర్‌మంతర్ వద్ద గళమెత్తిన సందర్భాలు లేనేలేవు. అధికారాన్ని కోల్పోయే ముందు చంద్రబాబు కాస్త నోరువిప్పినా అది సఫలీకృతం కాలేదు. అంత గొప్ప ప్రభావంతమైనదీ కాదు. 25మంది ఎంపీలను గెలిపిస్తే, కేంద్రం మెడలువంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానని బీరాలు పలికిన జగన్ అధికారంలోకి వచ్చాక కేసులు, కాసుల సమస్యలతో మోదీ సర్కారు అడుగులకు మడుగులొత్తే పనిలో అరవీరశూరుడయ్యాడు. దీంతో అడిగేవాడు లేక ఏపీ అంటే కేంద్రానికి ఒక బద్దెపురుగులాగ కన్పిస్తోంది, అన్పిస్తోంది.

పదేళ్లయినా విభజన హామీలు అమలుకు నోచుకోలేదంటే దేశంలో అక్షరక్రమంలో కాకుండా కేంద్రం దృష్టిలో ఆంధ్రప్రదేశ్ స్థానం ఎక్కడుందో చెప్పకనే చెప్పవచ్చు. ప్రత్యేక హోదా అటకెక్కింది. పోలవరం ప్రాజెక్టు పూర్తికాలేదు. రాజధాని నిర్మాణానికి సహకారం శూన్యం. కడప స్టీల్ ప్లాంట్ హామీ గాల్లో కలిసిపోయిందేమోనని అనుమానం. దుగరాజపట్నం పోర్టును పూర్తిగా పక్కనపెట్టారు. ఇక విశాఖ రైల్వేజోన్ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. హోదా కాదుకదా ప్రత్యేక ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ గాల్లో మాటలే. వైజాగ్-చెన్నై కారిడార్ ఉత్తుత్తి కబురే. రాజ్యాంగానికే మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉండటమనేది అంతంతమాత్రం. అలాంటిది ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అది లెక్కచేస్తుందా? ఈరోజు కాకపోతే రేపైనా విభజనహామీలను బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తుందంటే విశ్వసించగలమా? కనీసం విశాఖ రైల్వే జోన్ అయినా ముందుకొస్తుందంటే, రెండు ప్రభుత్వాల దొంగాటకు ఈ ప్రతిపాదన బలవుతోంది. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు రాష్ట్ర ప్రభుత్వమే మోకాలడ్డుతోందని కేంద్రం వాదిస్తోంది. ఈ జోన్ డీపీఆర్ పూర్తయిందని, స్థలం ఇవ్వడం ఒక్కటే పెండింగ్‌లో ఉందని రైల్వే మంత్రి చెప్పుకొచ్చారు. విశాఖలో రైల్వేల నుంచి తీసుకున్న స్థలానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ వద్ద గల స్థలాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఆ స్థలంలో ఆక్రమణలు తొలగించి, హద్దులు ఏర్పాటు చేయడంలో ఆ మధ్య జీవీఎంసీ అధికారులు హడావిడి చేశారు. రైతులు అడ్డుకోవడంతో పోలీసు బలగాలతో వారిని నియంత్రించారు. అయినా ఇప్పటివరకు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆక్రమిత స్థలంలో అత్యధిక భాగం స్థానిక వైసీపీ నాయకుడిదే ఉందని, అందుకే స్థలం అప్పగింతలో 'ఏదో లాలూచీ' నడుస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ స్థలంపై ఎలాటి వివాదం లేదని, ఇప్పటికిప్పుడు అప్పగించడానికి సిద్ధమని కలెక్టర్ తాజాగా చేసిన ప్రకటనతోనైనా దస్త్రం కదులుతుందని ఆశలు కలుగుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఇస్తామని చెప్పి ఇప్పటికే ఉన్న వాల్తేరు డివిజన్‌ను ఎత్తివేసింది. 200 కిలోమీటర్ల దూరంలో విజయవాడ డివిజన్ ఉండగా, వాల్తేరు డివిజన్ ఎందుకంటూ బీజేపీ పెద్దలు దురాలోచనతో వాల్తేరు డివిజన్‌లోని సగభాగాన్ని విజయవాడ డివిజన్‌లో కలిపేశారు. విజయవాడకు కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే గుంటూరు డివిజన్ ఉన్న విషయాన్ని విస్మరించారు. కోల్‌కతాలో రెండు జోనల్ హెడ్‌క్వార్టర్లు ఉన్నాయి. ఒక జోన్, మరో డివిజన్ ప్రధాన కార్యాలయం పక్కపక్కనే ఉండటంలో తప్పేముంది? ఇదంతా బీజేపీ నేతల కపటనాటకాలని తేటతెల్లమవుతోంది. ఐదేళ్లు మూగనోము పాటించిన వైసీపీ ఎంపీలు పార్లమెంటు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో తూతూమంత్రంగా విభజన హామీలను ప్రస్తావించి నవ్వులపాలవుతున్నారు. అయినా, విశాఖ రైల్వే జోన్ గురించి ఇప్పటికీ వారి నోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదంటే రానున్న ఎన్నికల్లో అటు బీజేపీ, ఇటు వైసీపీ విషయంలో ఏపీ ప్రజలు పునరాలోచన చేయాల్సిన తరుణం ఆసన్నమైంది.



కార్మికవర్గానికి అండ లాలాలజపతిరాయ్

దేశం రాజ్యాంగంలో అన్ని మతాలు, విశ్వాసాలను గౌరవించే ప్రధాన విలువలు, భాషలు, సంస్కృతులు, మన దుస్తులు, ఆహారపు అలవాట్లు, వైవిధ్యమైన పండుగలు ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బీజేపీ పాలనలో పెనుసవాలుగా మారాయని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు లలాలజపతిరాయ్ జయంతి సందర్భంగా జరిగిన సభలో కౌర్ మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జనవరి 28వ తేదీన దిల్లీలోని ఏఐటీయూసీ భవన్‌లో లజపతిరాయ్ విగ్రహాన్ని అమర్‌జీత్ కౌర్ ఆవిష్కరించారు. లజపతిరాయ్ జ్ఞాపకార్థం దేశ వ్యాప్తంగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు 50 గ్రామాల నుండి సేకరించిన మట్టితో పాటు తీసుకువచ్చిన మొక్కను లాలాలజపతిరాయ్ ముని మనుమరాలు అనితా గోయల్, అమర్‌జీత్ కౌర్ ఏఐటీయూసీ భవన్ ప్రాంగణంలో నాటారు. ఈ సందర్భంగా ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) బృందం పాటలను ఆలపించింది. ఈ ఆవిష్కరణకు దేశవ్యాప్తంగా ఉన్న ట్రేడ్ యూనియన్ నాయకులు పదిమంది హాజరయ్యారు.

లాలా లజపతిరాయ్ దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, భారతదేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు స్వేచ్ఛా భారత్ కోసం కలలు కన్నారు. నిరంకుశ సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికవర్గానికి రాయ్ అండగా నిలిచారని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. దేశప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న వారిపై కార్మికవర్గ పోరాటం కొనసాగుతుందన్నారు. దేశంలోని కార్మికులు, రైతాంగం నియంతృత్వ, నిరంకుశ వాదులను అధికారం పీఠం నుండి తరిమికొడతారని కౌర్ సవాలు చేశారు.

అనితా గోయెల్ మాట్లాడుతూ, లాలాలజపత్ రాయ్ అందరినీ సమైక్యపరచే విలక్షణమైన వ్యక్తిత్వం గల నాయకునిగా అభివర్ణించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన పోరాట యోధుడిగానే కాకుండా అన్ని రంగాలకు తన వంతు సహకారం అందించారని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు రాయ్ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్మిక సంఘాలు, రైతుల్లో పెరుగుతున్న ఐక్యతను బలోపేతం చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 16న జరిగే సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చింది. కార్మిక సంఘాలు, ఫెడరేషన్‌లు, ఇతర సంఘాలు, గ్రామీణ బంద్‌తో పాటు దేశవ్యాప్తంగా చేపట్టిన భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. కునాల్ రావత్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యంకోసం లజపతిరాయ్ తన ప్రాణాలు పణంగా పెట్టారని ఈ రోజు దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటం మరింతగా కొనసాగుతుందని అన్నారు.

ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి మోహన్‌శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనితా గోయల్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వికె సింగ్, లక్నోలో విగ్రహాన్ని తయారుచేసి తెచ్చిన ఉత్తరప్రదేశ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు, సీఐటీయూకి చెందిన అమితవ గుహ, ఐఎన్‌టీయూసీ నుంచి అష్ఫాడ్, హెచ్‌ఎమ్‌ఎస్ నుంచి మంజిత్, ఏఐయూటీయూసీ నుంచి ఆర్‌కె శర్మ, ఏఐసీసీటీయూ నుంచి రాజీవ్ డిమ్రి, ఎస్‌ఈడబ్ల్యుఏ నుంచి సుమన్, ఎల్‌పీఎఫ్ నుంచి రషీద్ ఖాన్, టీయూసీసీ నుంచి ధర్మేంద్ర, యూటీయూసీ నుంచి శత్రుజిత్ సింగ్, ఐటీయూసీ నుంచి నరేంద్ర ఈ సభకు హాజరయ్యారు.

కార్మికవర్గంపై మోదీ అలసత్వం

డా.జ్ఞాన్ పాఠక్

ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదని 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ స్పష్టం చేసింది. కార్మిక, ఉపాధిమంత్రిత్వ శాఖకు మొత్తం బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించి మోదీ కార్మిక వ్యతిరేకతను స్పష్టంగా వెల్లడించారు. 2019, 2020లో 40 కార్మిక చట్టాల స్థానంలో వివాదాస్పద నాలుగు స్మృతులను (నాలుగు కోడ్లు) తయారుచేయడం ద్వారా అన్ని విధాలుగా కార్మికులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నారు. వీటిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సంయుక్త కేంద్ర ట్రేడ్‌యూనియన్ల ఆధ్వర్యంలో సమ్మె, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. 'భారత్ బంద్' జరిపారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకతను వదలలేదు. దేశంలో అత్యధికంగా నిరుద్యోగం ఉన్నప్పటికీ ఒకటి, రెండు సందర్భాలలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొని తాత్కాలిక ఉద్యోగ నియామకపత్రాలు పంపిణీ చేసి తనకు కార్మికులకు, ఉద్యోగుల పట్ల ఎంతో శ్రద్ధఉందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారం చేసుకుంటున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించి కార్మికులను చిన్నచూపు చూశారు. 2023-24లో కేటాయింపులు రూ.13,221.73 కోట్లు కాగా, 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో రూ.12,531.43 కోట్లకు తగ్గించారు. అంతేకాదు, ఆయన తరచుగా ప్రచారంచేసే ప్రీతిపాత్రమైన పథకం 'ఆత్మ నిర్భర రోజ్‌గార్ యోజన'కు కూడా కేటాయింపులను గణనీయంగా తగ్గించారు. 2023-24లో రూ.2272 కోట్ల నుంచి 2024-25లో రూ.150కోట్లు తగ్గించారు. కార్మిక సంక్షేమ పథకానికి 2023-24లో రూ.102 కోట్లు కేటాయించగా, 2024-25లో సగానికి పైగా అంటే రూ.50.68 కోట్లకు తగ్గించారు. అలాగే 2020లో రూ.87కోట్లు కేటాయించగా 2023-24లో రూ.75 కోట్లకు తగ్గించారు.

ఫ్యాక్టరీ సలహా సేవల డైరెక్టరు జనరల్‌కు 2023-24లో రూ.40.3 కోట్లు కేటాయించగా, 2024-25లో రూ.39.34 కోట్లు కేటాయించారు. గనుల భద్రత డైరెక్టర్ జనరల్‌కు 2023-24లో రూ.120.93 కోట్లు కేటాయించగా, 2024-25కు ఈ మొత్తాన్ని రూ.119 కోట్లకు కోసేశారు. అలాగే ఉపాధి విభాగం డైరెక్టర్ జనరల్‌కు చాలా స్వల్పంగా పెంచారు. 2023-24లో 74.96కోట్లు కేటాయించగా, 2024-25కు రూ.76.86 కోట్లకు పెంచారు. కార్మికసంక్షేమ పథకం డైరెక్టర్ జనరల్‌కు 2023-24లో రూ.157.33కోట్ల నుంచి 2024-25లో రూ.156.36కోట్లకు తగ్గించారు. ప్రతి సంవత్సరం కార్మికుల వాస్తవ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వడంలేదు. ఎందుకంటే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ప్రజలకు తెలియకుండా ఉంచాలనేదే లక్ష్యం. 2023-24 సంవత్సరానికి రూ.175.78కోట్ల నుంచి బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా తగ్గించివేశారు. ప్రస్తుత ద్రవ్య విభాగంలో సంక్షేమ పథకం డైరెక్టర్ జనరల్ పనివిధానం జీరోగా ఉన్నది. పనివిధానం ఏమాత్రం మెరుగుపడలేదు. ప్రధానమంత్రి శ్రమయోగి మంధన్, ప్రధానమంత్రి కరమ్‌యోగి మంధన్ లాంటి ప్రాధాన్యతకలిగిన ఇతర పథకాలను మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేందుకు విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నారు. ఇందులోనూ ప్రధానమంత్రి శ్రమయోగి మంధన్‌కు రూ.177.24కోట్లు 2024-25లో తగ్గించారు. 2022-23లో రూ.269.91కోట్లు కేటాయించారు. దేశంలో అసంఘటితరంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం చాలా గొప్పలు చెప్పుకుంటోంది. మొత్తం కార్మికశక్తిలో వీరు 90శాతం ఉన్నారు. మొత్తం కార్మికుల సంఖ్య ఎంత అనేది తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో కేసువేశారు. సుప్రీంకోర్టు తన ఉత్తర్వులలో జాతీయస్థాయిలో అసంఘటిత కార్మికుల సంఖ్య తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించగా అందుకు ప్రభుత్వం అంగీకరించింది. జనాభా సంఖ్య పెరుగుతుండగా ఉద్యోగ మార్కెట్ మరింత సంక్షోభంలోకి జారుకుంది. ఉద్యోగ అవకాశాలు చాలా వేగంగా తగ్గిపోతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉద్యోగ అవకాశాలకు పోటీ తీవ్రంగా ఉంది. ఈ వర్గాలకు అవకాశాలు పెరగడం చాలా కష్టంగా ఉంది. అలాగే వీరికి విద్యలో సహాయం, మార్గదర్శకం ఎంతైనా అవసరం. ఉద్యోగాలకు సంబంధించి కేంద్రం అమలుజరిపే పథకాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నైపుణ్యాభివృద్ధి పథకాలకు శ్రద్ధ వహిస్తున్నామని చెప్పినప్పటికీ వాస్తవ పరిస్థితి వేరుగాఉంది. వివిధ పథకాలకు రాష్ట్రాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కేటాయించడం చాలా తక్కువగా ఉంది. ఉద్యోగాలను సృష్టించే శిక్షణా కార్యక్రమాలు (ఎస్సీ,ఎస్టీ, ఇతర ఓబీసీలకు) 2022-23లో గణనీయంగా తగ్గి గనుల విభాగంలో రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రతికూల మద్దతు ఉన్నది. ఎస్సీ,ఎస్టీ, ఓబీసీలకు శిక్షణా మార్గదర్శకాలకు కోటి రూపాయల లోపుగానే ఉన్నది. దేశంలో నిరుద్యోగం 7-10.1 శాతం సీఎంఐ నివేదిక ప్రకారం, 2023 అక్టోబరులో ఉన్నది. ఇదే సంవత్సరంలో కార్మికులు అంతక్రితం ఉన్నట్లుగానే 40శాతం మాత్రమే పాల్గొన్నారు. 20నుంచి 24శాతం వరకు ఉద్యోగాలులేని యువత పెరుగుతూఉంది. ఇక పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగ హామీ పథకాలు ఏమీలేవు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 86వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరికీ 100రోజుల పనికల్పనకు 2.72 లక్షలకోట్లు అవసరమవుతుంది. వ్యవసాయ వృద్ధి ఈ సంవత్సరం గణనీయంగా 1.8శాతం తగ్గిపోయింది. ప్రధాని గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 80కోట్లమంది ప్రజలకు ఆహార ధాన్యాలు సక్రమంగా లభించడంలేదు. ప్రపంచబ్యాంకు అంచనాప్రకారం, 97కోట్ల మందికి ఆరోగ్యకరమైన ఆహారం లభించడంలేదు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ కార్మికులను తీవ్రంగా నిరాశపరచింది. ఉపాధి కల్పన రికార్డు ఏమీ లేదు. కార్మికమంత్రి ప్రకారం, ఏడు నెలలక్రితం 1.25కోట్ల ఉద్యోగాలను గత తొమ్మిదేళ్లలో మోదీ కల్పించారు. అయితే ఇవన్నీ సరైన గణాంకాలు కాదు. అలాగే పర్మినెంట్ ఉద్యోగాలు కాదు.

మానవవాద కోణంలో పునః నిర్వచించుకోవాలి!

డాక్టర్ దేవరాజు మహారాజు

"మనిషి ప్రవర్తన, ప్రవృత్తుల గురించి మనం ఇంకా ఎక్కువగా అర్థం చేసుకోవాల్సి ఉంది. ఎందుకంటే, మనిషి వల్లే మానవ జాతికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇది అందరికీ తెలిసిన దయనీయమైన పరిస్థితి. మనిషి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అతని మానసిక ప్రవర్తన, పరివర్తనల మీద అధ్యయనం జరగాల్సి ఉంది. రాబోయే అతి భయంకరమైన ప్రమాదాలకు మనమే కారణం కాబోతున్నాం అని తెలుసుకోవడం మంచిది" అని అన్నారు స్విట్జర్లాండ్ సైకియాట్రిస్ట్ కార్ల్ గుస్టావ్ జంగ్ (26 జులై 1875 - 6 జూన్ 1961) ఇది ఆయన 1959 లో చెప్పిన మాట! పాత తప్పుల్ని సరిదిద్దుకుంటూ అవగాహన పెరిగిన ఆధునికుడు ప్రతి విషయాన్ని మళ్ళీ కొత్తగా ఇప్పటి పరిస్థితులకు అనువైన విధంగా నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే పౌలింగ్ అంటారు. " మానవవాదమనేది ఆనందకరమైన తాత్త్వికి సేవ. మానవాళికి అత్యున్నతమైన సేవలు అందించడానికి, కొత్త కొత్త ఆలోచనలతో అందరికీ వైజ్ఞానిక ప్రగతిని అందుబాటులోకి తేవడానికి ఉద్దేశించబడింది " అనస్ కార్ల్ పౌలింగ్ - అమెరికా రసాయన శాస్త్రవేత్త, రచయిత, శాంతి కార్యకర్త.

ఇక్కడ మన భారతదేశానికి సంబంధించిన అంశాల్ని విపులంగా పరిశీలిద్దాం! బౌద్ధ ధమ్మాన్ని (ధర్మాన్ని) ధ్వంసం చేస్తూ వచ్చిన ఆర్యులు బౌద్ధాన్ని కనుమరుగు చేయడం కోసమే - బ్రహ్మ, విష్ణు, మహేశ్వర అనే పేర్లతో దేవుళ్లని సృష్టించి, జనం మెదళ్లని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అందుకే చూడండి ... బ్రాహ్మణుడు లేకుండా ఏ కార్యక్రమం జరగదు' - అనే స్థితికి సమాజాన్ని తీసుకొచ్చారు. బహుజన సమాజాన్ని అజ్ఞానులుగా చేశారు. అందువల్ల బ్రాహ్మణులు లేకుండా, అర్థం లేని మంత్రాల ప్రమేయం లేకుండా ఎవరి కార్యక్రమాలు వారు హుందాగా నిర్వహించుకుంటూ ఉండాలి. ఆర్యులు (బ్రాహ్మణులు) తమ ఉనికిని తాము కాపాడుకోవడానికి దేవుడు, మతం, మంత్రాలతో... కొన్ని కట్టు కథల ఆధారంగా తమ ఆధిపత్యాన్ని ఇంకా చాటుకుంటూ ఉన్నారు. బహుజనులు దాన్ని గుర్తించాలి!

చిన్నప్పుడు పాఠశాలల్లో చదువుకునే రోజుల్లో పరుగు పందాలుండేవి. మామూలు పరుగు పందాలు కాకుండా ఒంటి కాలితో ఎవరెంత దూరం - ఎంతా వేగంతో పరుగెత్తుతారు అని ఒక పోటీ ఉండేది. అది కాక, ఒకరి కాలు మరొకరి కాలుతో కట్టేసి - అలా జంటలుగా పరుగెత్తే పోటీ మరొకటి ఉండేది. నిజ జీవితంలో అణగారిన వర్గాల పరిస్థితి చాలా ఘోరంగా ఉంటుంది. అక్కడ రెండు కాళ్లు కట్టేసి, గెంతుతూ పరిగెత్తమంటారు. అందరిలాగే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయని చెప్పనైతే చెపుతారు. కానీ, అవి ఉండవు. అలాంటి ఎన్నెన్నో బంధనాలలో చిక్కుకుని కూడా ఎంతో శ్రమించి, నెగ్గుకొచ్చిన బహుజనులు ఉన్నత స్థానాల్ని అలంకరిస్తే, అప్పటికీ ఈ లోకం హర్షించదు. 'వెధవలు రిజర్వేషన్ లో వచ్చినవారు' అని ఎద్దేవా చేస్తుంది. రిజర్వేషన్ కాదని, కేవలం ప్రతిభతో నెగ్గుకొచ్చినా... ప్రశంస లభించదు. కాళ్లు కట్టేసినా, రెక్కలు విరిచేసినా ఆత్మ బలంతో గెంతుతూ ఎగురుతూ ఉన్నత శిఖరాలకు చేరుకున్న విషయాన్ని తక్కువ చేసి చెపుతుంది - లోకం! అగ్రవర్ణానికి చెందిన క్రీడాకారిణి ఓ చిన్న పతకం తెస్తే బాకాలూదే మీడియా వేలడప్పులు కొట్టి చెప్పిందే చెపుతూ ఉంటుంది. అదే ఏ దళిత యువతో క్రీడల్లో రాణించి స్వర్ణ పతకం తెచ్చినా, మీడియా గొంతు పెగలదు. ప్రభుత్వ పెద్దల చూపు ఆనదు. ఇలాంటి వివక్ష ఇంకా ఎంత కాలం ? మనుషులు, వ్యవస్థలు, ప్రభుత్వాలు వైఖర్లు మార్చుకోవాల్సిన అవసరం లేదా?

పోటీ ఉంటే గింటే సమానంగా ఉండాలి. అవకాశాలు ఇవ్వకుండా అణిచి పెట్టి, విద్యకు, ఆర్థిక స్థోమతకు దూరంచేసి శూద్రుల్ని, మహిళల్ని, దళితుల్ని అణగదొక్కి, వాళ్ళంతా తెలివి లేని వారిని నిర్ణయిస్తే ఎలా? సమానావకాశాలు కల్పించి చూడండి. ఎవరు ప్రతిభావంతులో తెలుస్తుంది. అక్రమంగా శ్రమ దోపిడి జరగకుండా చూడండి. అబద్ధాన్ని నిజమని నమ్మించడం సులు వైపోయింది. నిజాన్ని నిజమని నమ్మించడమే కష్టమైన పనిగా మారింది. అందుకే అధిక సంఖ్యాకులైన బహుజనులు, మైనార్టీలు, మహిళలు విషయాన్ని విస్తారంగా అవగాహన చేసుకోవాల్సిన తరుణం వచ్చేసింది. ఇంతెందుకూ? అక్రమంగా ఆక్రమించుకున్న లక్షల ఎకరాల భూమి ఎవరెవరిదో లెక్కలు తీయండి. చమటోడ్చి వాటిని పండిస్తున్న దెవరో లెక్క కట్టండి. విషయం బోధపడుతుంది. వివక్ష, అణచి వేత గురించి అంతా అక్కడే తేట తెల్లమౌతుంది. స్వేచ్ఛగా పరిగెత్తగలిగిన వారు పరిగెత్త గలిగినంత దూరం పరిగెత్తి భూములు ఆక్రమించుకున్నారు కదా? అది సరిపోలేదన్నట్లు అరఎకరం గాళ్లను ఇంకా ఎందుకు హింసిస్తారూ? ఇక్కడ భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, నవబుద్ధుడు, బోధి సత్వ డా॥ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాట గుర్తు చేసుకోవాలి "బ్రాహ్మణ స్త్రీ కడుపుతో ఉంటే తనకు పుట్టబోయే కొడుకుకు ఏదైనా హైకోర్టులో న్యాయమూర్తి పదవి దొరుకుతుందేమోనని ఆశపడుతుంది. దాని కోసమే ఆలోచిస్తుంది. కానీ, అదే వేరే నిమ్న జాతి స్త్రీ అయితే ఏ మున్సిపల్ పరిధిలోనో పాకీపని కోసం ఆలోచిస్తుంది. అంతకంటే ఉన్నతమైన ఉద్యోగం కోసం ఆశపడదు. ఎందుకు ఇలా జరుగుతోంది అంటే, హిందూ మత ప్రభావం బలంగా ఉండడం వలన ! అగ్ర కులాల వారు ఉన్నతమైన కోర్కెలు కోరుకోవాలని, తక్కువ కులాల వారు హీనమైన కోర్కెలు మాత్రమే కోరుకోవాలని హిందూమతం కొన్ని శతాబ్దాలుగా బోధిస్తూ ఉన్నందు వల్ల, ఇలాంటి దౌర్భాగ్యపు స్థితి వర్ధిల్లుతూ ఉంది. హిందూ మతంలో అంతర్భాగంగా ఉన్నంత కాలం శూద్రులు, మహిళలు ఏ విధమైన మార్పును ఆశించలేరు. హిందూ మతాన్ని వదిలి, బుద్ధుని మార్గాన్ని అనుసరించగలిగితే ఉన్నతమైన ఆశయాలకు, ఆశలకు ఆస్కారం ఉంటుంది. " అన్నారు అంబేద్కర్.తమకు తాము అగ్రవర్ణాలుగా ప్రకటించుకున్న ఆర్యులు (బ్రాహ్మణులు/ మనువాదులు) మిగతా అధిక సంఖ్యాకుల్ని తమకు బానిసలుగా బతకమన్నారు. అంతే కాదు, వారు తమకు ఏఏ దానాలు ఎప్పుడెప్పుడు చేయాలో, ఎలా చేయాలో కూడా ప్రకటించారు. విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. ఉదాహరణకు ఇక్కడ కొన్ని విషయాలు చూద్దాం. బ్రాహ్మణులకు చేయాల్సిన షోడశ (16) దానాలలో మొదటిది కన్యా దానం. బ్రాహ్మణుడికి ఏయే దానాలు ఇవ్వాలో తెలియజేసే శ్లోకం ఎలా ప్రారంభమవుతుందో గమనించండి." కన్యా కనక దాసీచ శకటాశ్వ గజా గృహం "- కన్యాదానం పెళ్లి కొడుక్కి చేసేది కాదు, పురోహితుడికి చేసే తంతుగా మొదట ప్రారంభమైంది. పెళ్లి కూతురు మూడు రాత్రులు బ్రాహ్మణుడితో గడిపిన తర్వాతనే సదరు పెళ్లి కొడుకు దగ్గరకు వచ్చే సంప్రదాయం ఉండేది. కాలక్రమంలో నాగరికత పెరుగుతున్న కొద్దీ ఈ పరిస్థితి మారింది. సంప్రదాయ వాదులు ఇంకా ఇదే పద్ధతి కొనసాగాలని అనుకుంటున్నారా?

దత్తం న దీయతే దానం గ్రాహీత్సవ యాచతే!

ఉభౌతే నరకే యాతశ్చిన్నర జ్జో / ఘటో యథా !! (45-60) (శ్రీ దేవీ భాగవతం)

దీని అర్థం ఏమిటంటే బ్రాహ్మణుడు అడిగిన దక్షిణ ఇవ్వని ఇంటి యజమాని కుంభీపాక నరకాలకి పోతాడు. లక్ష సంవత్సరాలు యమ దూతల చేతుల్లో నానా హింసలు అనుభవిస్తాడు. అటుపై దరిద్రుడిగా, వ్యాధి గ్రస్తుడిగా జన్మిస్తాడు. అతని కుటుంబంలో అటూ, ఇటూ ఏడు తరాల వారికి మహాపాపం చుట్టుకుంటుంది. ఇదంతా భయపెట్టడానికి అతిశయోక్తులు చెప్పినట్టుగా ఉంది. లక్ష సంవత్సరాలు ఎవరు జీవించాలి? యమ దూతలు హింసించాలంటే ఆ ఇంటి యజమాని లక్ష సంవత్సరాలు జీవించి ఉండాలి కదా? యమదూతలు కల్పితమే. లక్ష సంవత్సరాలు జీవించడం కల్పితమే. ఏడు తరాల మహాపాపం కల్పితమే. జనాన్ని భయ భ్రాంతులను చేయడానికి వారు ఏ స్థాయికైనా పోతారనేది అర్థమవుతూ ఉంది. భగవద్గీత లో ఇలా ఉంది. " అన్నము వలన జంతు జాలము పుట్టును. వర్షము వలన అన్నము సమకూరును. యజ్ఞము వలన వర్షము కలుగును. ఆ యజ్ఞము కర్మవలననే సంభావమగును" ప్రకృతి పై నేడు స్కూలు పిల్లలకు గల అవగాహన కూడా నాటి భగవద్గీత రచయితలకు లేదు. పర్యావరణ పరిజ్ఞానం ఏ మాత్రం లేక పోయినా, అదొక పవిత్ర గ్రంథంగా ప్రచారం చేశారు.

ఉత్తర ప్రదేశ్ ఉన్నావ్ జిల్లా జలాన్‌లో ఒక దళిత యువకుడు అగ్రవర్ణాల వారితో సహపంక్తి భోజనం చేశాడని, బయటికి లాగి ముక్కు కోసేశారు. ఇది 2021 ఆగష్టు 9న జరిగింది. రామాయణంలో శూర్పణఖ ముక్కు చెవులు కోయడం.. వారికి స్ఫూర్తినిచ్చి ఉంటుంది. అసలైతే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలి. అగ్రవర్ణానికి చెందిన ఆ దుండగులు బలవంతులు కావడంతో స్థానిక పోలీసులు తమ విధి నిర్వహణ మరిచారు. అగ్రవర్ణ దుండగుల్ని వదిలేశారు. దేశంలో బలహీనులైన వారికి న్యాయం లభించదు. ఇలాంటివి కేవలం భారతదేశంలో మాత్రమే జరుగుతాయి. పాపం, పుణ్యం, దేవుడు, దైవాజ్ఞల పేరుతో అమాయకులైన అధిక సంఖ్యాకుల్ని మోసం చేస్తూ ఇంత వరకు బతికింది చాలదా? బానిసలుగా బతికిన బహు జనులు, మహిళలు ఇకనైనా తమ జీవితాల్ని పునః నిర్వచించుకోవాలి కదా? పాత విలువల్ని ధ్వంసం చేస్తూ సమాన హక్కుల కోసం, స్థాయి కోసం పోరాడాల్సిన అవసరం లేదా? ఒక దేశంలో 'కళ్లుండడం ఒక రోగం' అని భావిస్తారట! కళ్లున్న వారి కళ్లు పొడిచి గుడ్డి వాళ్లను చేస్తారట. ఆ దేశమేదో మనదే ఎందుకు కాకూడదూ? కళ్లు మాత్రమే కాదు ఇక్కడ మెదళ్లు కూడా చిదిమేస్తారు. "వేదాలలో ఏముందని" అడుగు - చాలు! చంపేయకపోతే చూడు. పోనీ నువ్వే ఇంకొకర్ని చంపుతూ పోయావనుకో - ఫినిష్! నిన్ను ఈ దేశం డేరా బాబానో, సద్గురువునో చేసేస్తుంది. అంతే!! ఇలాంటివి కేవలం భారత్‌లోనే సాధ్యం! అంతే కాదు భారత్‌కే పరిమితం. దొంగ బాబాలు, దొంగ సన్యాసులు, రాజకీయ నాయకుల వేషధారణలో ఉన్న యోగులు అధిక సంఖ్యలో ఉన్న దేశం కాదా ఇది? వీరంతా ఒక్కసారి ప్రజాకవి వేమన పద్యాలు చదివి అర్థం తెలుసుకుంటే ఎంత బావుండునూ ? " ఎద్దుకైన గాని యేడాది తెలిపిన / మాట తెలిసి నడచు మర్మమెరిగి / మొప్పె తెలియలేదు ముప్ప దేండ్లకు నైన/ విశ్వదాభిరామ వినురవేమ" - ఒక్క సంవత్సరం పాటు నేర్పిస్తే ఎద్దయినా మనం చెప్పినట్లు నడుచుకుంటూ సేద్యానికి ఉపయోగపడుతుంది. మూర్ఖుడు మాత్రం ముప్పయేళ్లు చెప్పినా తెలుసుకోలేడు - అని ఆ వేమన పద్యానికి తాత్పర్యం. హేతువాదం తెలియని వారిని నాయకులుగా ఎన్నుకుంటున్న ఈ దేశ ప్రజలు ఎంతకాలం ఎద్దుకన్నా హీనంగా వ్యవహరిస్తారూ? "ఎవడెవడు బ్రహ్మకు పుట్టాడో మాకు తెలియదు. మేం మాత్రం మా అమ్మకే పుట్టాం" అన్నారు మహాకవి గుర్రం జాషువా. ఆ మాటలోని అంతరార్థం గ్రహించనంత కాలం, వర్ణ వ్యవస్థను ధిక్కరించనంత కాలం, మానవ జాతి అంతా ఒక్కటే- అని నినదించనంత కాలం ఈ దేశం ఇలాగే అభివృద్ధి చెందని దేశాల్లో ఒకటిగా ఉండిపోతుంది. సంప్రదాయ వాదుల నోళ్లు మూయించి, దేశాన్ని అభివృద్ధి పథాన నడిపించాల్సిన బాధ్యత నేటి యువతరం మీదే ఉంది.

కేంద్ర సాహిత్య అకాడెమి విజేత, జీవ శాస్త్రవేత్త.

ఆప్ ఎంపీ ప్రమాణ స్వీకారానికి కోర్టు అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ ఈనెల 5న రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. సంజయ్ సింగ్ ప్రమాణస్వీకారానికి రౌస్ అవెన్యూ కోర్టు శనివారం అనుమతించింది. ఆరోజు ఉదయం 10 గంటలకు ఆయనను పార్లమెంటుకు తీసుకు వెళ్లాల్సిందిగా జైలు అధికారులను ఆదేశించింది. రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసేందుకు, ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు వీలుగా తనకు మనీలాండరింగ్ కేసులో తాత్కాలిక బెయిలు మంజూరు చేయాలని సంజయ్‌సింగ్ గురువారం కోర్టును ఆశ్రయించారు. ఫిబ్రవరి 4 నుంచి 10 వరకూ తాత్కాలిక బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ఈడీకి నోటీసు జారీ చేశారు. మనీలాండరింగ్ కేసులో గతేడాది అక్టోబర్ 4న సంజయ్‌సింగ్‌ను ఈడీ అరెస్టు చేసింది. తనపై వచ్చిన ఆరోపణలను సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. బెయిలు కోరుతూ ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు డిసెంబర్ 22న తోసిపుచ్చింది. జనవరిలో ఢిల్లీ నుంచి రాజ్యసభకు ఆప్ అభ్యర్థిగా సంజయ్ సింగ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మంత్రులకు శాఖల కేటాయింపు

హోం శాఖ నితీశ్ వద్దే

పాట్నా: బీహార్‌కు తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్ తన మంత్రివర్గానికి శనివారం శాఖలు కేటాయించారు. హోం శాఖను సీఎం తన వద్దనే ఉంచుకున్నారు. ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి ఆర్థిక, ఆరోగ్యం, క్రీడాశాఖలు అప్పగించారు. మరో ఉపముఖ్యమంత్రి విజయ్ సిన్హాకు వ్యవసాయశాఖ కేటాయించారు. విపక్ష 'ఇండియా' కూటమికి, బీహార్‌లోని మహాఘట్బంధన్‌కు ఉద్వాసన చెప్పిన నితీశ్ కుమార్ తిరిగి ఎన్డీయేలో చేరడం ద్వారా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. జనవరి 28న 8 మంది మంత్రులతో కలిసి ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. జేడీయూ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ముగ్గురు, హెచ్‌ఏఎం నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు నితీశ్ క్యాబినెట్‌లో చేరారు.

12 ఏళ్లుగా భార్యకు చిత్రహింసలు...

బెంగళూరు: భర్త చేతిలో 12 ఏళ్లుగా చిత్రహింసలకు గురవుతున్న భార్యను పోలీసులు రక్షించారు. ఈ ఘటన కర్నాటకలోని మైసూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైసూరుకు చెందిన ఓ మహిళకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లైనప్పటి నుంచి భర్త ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో అప్పటి నుంచి ఆమెను బయటకి వెళ్లనివ్వకుండా ఇంట్లోనే ఓ గదిలో ఉంచేవాడు. ఆమె కాలకృత్యాలు తీర్చుకోవడానికి చిన్న బాక్స్‌ను ఉపయోగించేంది. వారి ఇద్దరు పిల్లలను తండ్రి వచ్చేవరకు ఇంటి బయటే నిలబెట్టేవాడని బాధితురాలు వాపోయింది. తనకు పెళ్లయి 12 ఏళ్లైందని, తన భర్త ఇంట్లో బంధించి చిత్రహింసలు పెట్టేవాడని, ఎవరూ ప్రశ్నించకపోవడంతో మితిమీరేవాడని ఆ మహిళ చెప్పింది. పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే గదిలోనే ఆహారం వండి అందించేదానినని వివరించింది. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆమెకు విముక్తి కలిగించారు. భర్తను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుగొల్పే విషయాలు బయటపడ్డాయి. భార్యపై అనుమానంతో అతను ఇలా చేసినట్లు విచారణలో తేలింది. అతని మానసిక స్థితి సరిగ్గా లేదని కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు పోలీసులు వివరించారు.

జేఎంఎం, కాంగ్రెస్ రాజకీయ డ్రామా: బీజేపీ

రాంచీ: జార్ఖండ్‌లోని జేఎంఎం నేతృత్వంలోని కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించడం... జేఎంఎం, కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత విభేదాలను కప్పిపుచ్చే రాజకీయ ఎత్తుగడగా జార్ఖండ్ బీజేపీ ఆరోపించింది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆరోపణను ఆ పార్టీ తోసిపుచ్చింది. జేఎంఎం నేతృత్వంలోని కూటమికి బీజేపీ నుండి ఎలాంటి ముప్పు లేదని, ఆ రెండు పార్టీల మధ్య మంత్రి పదవులు, సీట్ల పంపకంపై సయోధ్య కుదరలేదని బీజేపీ సీనియర్ నేత అమర్ బౌరి చెప్పారు. తమ అంతర్గత విభేదాలు దాచడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజల దృష్టి మరలడానికే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నాలుగేళ్ల క్రితం హేమంత్ సోరెన్ ప్రభుత్వం అనేక న్యాయపరమైన వివాదాల్లో చిక్కుకుందని, దీనికితోడు కుటుంబ పాలన చెదపురుగు లాంటివని ప్రధాని మోదీ పదే పదే చెబుతూ వస్తున్నారని, దేశంలో రాజవంశ రాజకీయాలకు వ్యతిరేకంగా వాతావరణం నెలకొనడంతో చంపై సోరెన్ సీఎం అయ్యారని అమర్ బౌరీ అన్నారు. చంపై సోరెన్ శుక్రవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అధికార జేఎంఎం నేతృత్వంలోని 38 సంకీర్ణ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించారు. జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబులాల్ మరాండీ చంపైను అభినందించారు.

8న ఢిల్లీలో డీఎంకే ధర్నా

చెన్నై: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో తమిళనాడుకు నిధులు కేటాయించకపోవడానికి నిరసనగా ఈనెల 8న పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నల్ల చొక్కాలతో ధర్నా చేస్తామని డీఎంకే శనివారం ప్రకటించింది. తమ రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని దుయ్యబట్టింది. కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాల ఎంపీలతో కలిసి ధర్నా చేస్తామని డీఎంకే ఎంపీ టీఆర్ బాలూ తెలిపారు. '2023 డిసెంబరులో తుపాను, ఎడతెరిపిలేని వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం జరిగింది. రూ.37వేల కోట్ల ప్యాకేజిని కేంద్రం నుంచి కోరాం. కానీ బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదు. అంతేకాకుండా మధురైలో ఎయిమ్స్‌తో సహా తమిళనాడులో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఎలాంటి కేటాయింపులు జరగలేదు' అని డీఎంకే ఓ ప్రకటన వెలువరించింది. 8వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ విగ్రహం వద్ద డీఎంకే ఎంపీలంతా ధర్నా చేస్తారని పేర్కొంది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తమిళనాడుకు మొండిచేయి చూపడాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తీవ్రంగా ఖండించారు.

జూనియర్ జడ్జి ఆత్మహత్య

బదౌన్: ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ కోర్టు జూనియన్ సివిల్ జడ్జి జోత్స్నరాయ్ (27) ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక జడ్జి కాలనీలో ఉంటున్న ఆమె, పడకగదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు పోలీసు అధికారి శనివారం తెలిపారు. గదిలో ఆమె రాసిన సూసైడ్ నోట్ ఉన్నదని చెప్పారు. జిల్లా జడ్జి, జిల్లా మెజిస్ట్రేట్, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (బదౌన్) ఘటనాస్థలానికి వెళ్లి ఆరా తీశారు. ఎస్ఎస్పీ (బదౌన్) అలోక్ ప్రియదర్శిని మాట్లాడుతూ నగరంలోని జడ్జి కాలనీ కాంపెక్స్‌లోని ఇంటి మొదటి అంతస్తులో జడ్జి జోత్స్న రాయ్ నివాసమున్నారు. తన పడక గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నారు. సూసైడ్ నోట్‌తో పాటు కొన్ని పత్రాలు ఆమె గదిలో లభ్యమయ్యాయి. మానసిక ఒత్తిడి వల్లనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం' అని అన్నారు. అయితే శనివారం ఉదయం 10గంటల వరకు రాయ్ కోర్టుకు రాలేదు. తోటి న్యాయమూర్తులు ఫోన్లు చేస్తే స్పందన లేదు. దీంతో వారు ఆమె ఇంటికి వెళితే పడకగది తలుపులు లోపల నుంచి బిగించివున్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకొన్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా మహిళా న్యాయమూర్తి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మహువా జిల్లాకు చెందిన రాయ్ బదౌన్ జూనియర్ సివిల్ జడ్జిగా గతేడాది ఏప్రిల్ 29న నియమితులయ్యారు. అయోధ్యలో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ బాధ్యతలు చేపడుతున్నారు.

విద్యార్థి ఆత్మహత్య... కోటాలో హాస్టల్ మూసివేత



కోటా: రాజస్థాన్‌లోని 'కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. వీటి నివారణ కోసం జిల్లా యంత్రాంగం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఆ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు ఒక హాస్టల్‌ను అధికారులు శనివారం సీజ్ చేశారు. నీట్ విద్యార్థి ఇటీవల ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజీవ్‌గాంధీ నగర్‌లో ఈ ఘటన జరిగింది. దర్యాప్తునకు జిల్లా కలెక్టర్ రవీంద్ర గోస్వామి ఆదేశించారు. విద్యార్థి మరణించిన హాస్టల్‌లో స్ప్రింగ్ ఫ్యాన్లు లేకపోవడంతో అధికారులు దాన్ని మూసివేశారు. ఆ వసతిగృహంలో 32 గదులు ఉంటే కేవలం 10 గదుల్లో విద్యార్థులు ఉన్నారు. మిగితా వారిని వేరే చోటుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. కోటాలో మొత్తం 4,500లకుపైగా హాస్టళ్లు, 40 వేల పీజీలు ఉన్నాయి. దాదాపు 2 లక్షల మందికిపైగా విద్యార్థులు ప్రతి సంత్సవరం వివిధ కోర్సుల్లో శిక్షణ కోసం ఇక్కడికి వస్తుంటారు. అన్ని హాస్టళ్లు, పీజీల్లో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలున్నాయి. గతేడాది 26 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా ఈ ఏడాదిలో ముగ్గురు బలవంతంగా తమ ప్రాణాలు తీసుకున్నారు.

శివసేన నేతపై బీజేపీ ఎమ్మెల్యే కాల్పులు

ముంబై: మహారాష్ట్రలో సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనకు చెందిన నేతపై బీజేపీ ఎమ్మెల్యేపై జరిపిన కాల్పులు కలకలం రేపింది. భూవివాదం నేపథ్యంలో షిండే వర్గం శివసేన ముంబై అధ్యక్షుడు మహేశ్ గైక్వాడ్, మరోనేత రాహుల్ పాటిల్‌పై బీజేపీ ఎమ్మెల్యే గణపతి గైక్వాడ్ కాల్పులు జరిపారు. ఈ ఘటన హిల్ పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వార్లీ గ్రామంలోని భూవివాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి గణపతి గైక్వాడ్ కొడుకు వైభవ్ గైక్వాడ్ పోలీసు స్టేషన్‌కు తన అనుచరులతో వచ్చారు. అదే సమయంలో మహేశ్ గైక్వాడ్ సైతం తన కార్యకర్తలతో వచ్చారు. కొంత సమయానికి గణపతి కూడా పోలీసు స్టేషన్‌కు వచ్చారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ అనిల్ జగ్‌తాప్... ఇద్దరు నేతలను కూర్చోబెట్టి మాట్లాడుతున్న సమయంలో స్టేషన్ వెలుపల రెండు వర్గాల అనుచరులు ఆందోళనకు దిగారు. వారిని అదుపు చేయడానికి ఇన్‌స్పెక్టర్ బయటకు వెళ్లారు. ఆ సమయంలో గణపతి గైక్వాడ్... మహేశ్ గైక్వాడ్, మరో నేత రాహుల్ పాటిల్‌పై తుపాకితో ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో మహేశ్ గైక్వాడ్, రాహుల్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన మహేశ్ గైక్వాడ్, రాహుల్‌ను థానేలోని ఆస్పత్రికి తరలించారు. మహేష్ గైక్వాడ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ ఎమ్మెల్యే గణపతి గైక్వాడ్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలోని రెండు పార్టీల నేతల మధ్య జరిగిన కాల్పుల ఘటన మహారాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు ఉపముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవిస్ చెప్పారు.

పశ్చాత్తాపం లేదు: గణపతి

ఆత్మరక్షణ కోసమే షిండే వర్గం శివసేన నేతపై కాల్పులు జరిపానని ఎమ్మెల్యే గణపతి తెలిపారు. తన కొడుకుపై పోలీసు స్టేషన్‌లో మహేశ్, అతని అనుచరులు దాడి చేయడానికి ప్రయత్నించారని, అందుకే వారి నుంచి తన కొడుకును కాపాడే క్రమంలో కాల్పులు జరిపినట్లు తెలిపారు. కాల్పుల ఘటనపై తనకు ఎటువంటి పశ్చాత్తాపం లేదని పేర్కొన్నారు.

పోరాటంలో రాహుల్‌కు మద్దతు ఇవ్వకపోతే

మోదీకి ప్రజలు బానిసలే...

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతికూల పరిస్థితుల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని, ఈ పోరాటంలో రాహుల్ విఫలమైతే మోదీ పాలనలో ప్రజలు నష్టపోతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం ఇక్కడ అన్నారు. కాంగ్రెస్ తరపున రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపిన ఖర్గే... యాత్ర చేపట్టాలనేది బహుశా పార్టీలో ఇప్పటి వరకు ఏ నాయకుడూ తీసుకోని అతి పెద్ద అడుగు అని అన్నారు. 'యువత, మహిళలు, రైతులు, పేదలు అందరికీ న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు. ఇంత ప్రతికూల పరిస్థితులు, చలి పరిస్థితులు ఉన్నా ఆయన యాత్ర కొనసాగిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వ దురాగతాలకు వ్యతిరేకంగా ఆయన పోరాడుతున్నారు' అని తూర్పు ఢిల్లీలో జరిగిన 'న్యాయ సంకల్ప సమ్మేళనం' ర్యాలీలో ఖర్గే అన్నారు. 'ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని, దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకే. ఈ పోరాటంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంలో విఫలమైతే మీరు మోదీకి బానిస అవుతారు' అని ఖర్గే అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనాన్ని వెలికితీస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మండిపడ్డారు. 'మోదీ గ్యారెంటీ ఏమిటి? అని ఖర్గే ప్రశ్నిస్తూ, మోదీ ఇచ్చిన హామీలు అమలుచేయలేదన్నారు. ప్రధాని తన అభిప్రాయాలను దేశంపై రుద్దేందుకు ప్రయత్నిసున్నారని, అధికారం కోసం అందరినీ శిక్షిస్తున్నారని ఆరోపించారు. 'మా పోరాటం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పైనే... దేశాన్ని అంతం చేయాలని, పేదలను దూరం చేయాలని చూస్తున్నారు. బీజేపీ విభజన విధానానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలి' అని కోరారు. దేశంలోని కాంగ్రెస్ సభ్యులతో సహా ఎవరైనా తెలివిగా మాట్లాడే వారిపై ఎఫ్ఐఆర్‌లు వేస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన 411 మంది శాసనసభ్యులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఆయన పేర్కొన్నారు. జార్ఖండ్‌లో విపక్ష ఎమ్మెల్యేలను విడదీయడానికి బీజేపీ ప్రయత్నించిందని, అయితే కాంగ్రెస్, ఆర్‌జేడీ గిరిజన శాసనసభ్యులు అలాంటి చర్యను ప్రతిఘటించాలని నిర్ణయించుకున్నారని, మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడిందని ఖర్గే చెప్పారు. మహాఘటబంధన్ కూటమి నుంచి వైదొలిగినందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై కూడా విరుచుకుపడ్డారు. 'ఆయన సోషలిజం గురించి చాలా మాట్లాడేవాడు. కానీ పల్టు కుమార్ అని తేలింది' అని అన్నారు. బూత్ స్థాయి కార్యకలాపాలపై దృష్టి సారించాలని, ఓట్ల పోలింగ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు దూకుడు, పట్టుదల ఉన్న పార్టీ కార్యకర్తలను నియమించాలని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీలో గెలిస్తే దేశంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయో ఇంకా తేలలేదని, ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి నియోజకవర్గంలో కష్టపడి పని చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

బీజేపీపై పోరుకు అందరూ కలిసి రావాలి: జైరాం రమేశ్

గొడ్డా (జార్ఖండ్): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పటికీ ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో భాగమేనని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ శనివారం అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు సాధిస్తుందా అనే సందేహాన్ని బెనర్జీ వ్యక్తం చేసిన మరుసటి రోజే ఆయన ఈ ప్రకటన చేశారు. గొడ్డాలో రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' వివరాలను జైరాం రమేశ్ వెల్లడిస్తూ... ఆమె (మమతా బెనర్జీ) ఇప్పటికీ 27 పార్టీల సమూహం అయిన 'ఇండియా' కూటమిలో భాగమని మేము భావిస్తున్నాము. బీజేపీతో పోరాడటమే తన ప్రాధాన్యత అని ఆమె పేర్కొంది. బీజేపీతో పోరాడటమే మా ప్రాధాన్యత. మనం అందరం కలిస్తే మంచిదని నేను భావిస్తున్నాను. పాట్నాలో, బెంగళూరులో, ముంబయిలో మేం కలిసి ఉన్నాం. కానీ ఏదో జరిగినట్లుంది. మొదట శివసేన విడిపోయింది. ఆ తర్వాత నితీశ్ కుమార్ 'పల్టీ' కొట్టారు. ఇప్పుడు మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు.. మనం గ్రహించాలి. ఇది స్థానిక స్థాయి ఎన్నికలు కాదు' అని ఆయన పీటీఐ వార్తా సంస్థతో అన్నారు. శుక్రవారం కోల్‌కతాలో జరిగిన ధర్నాలో మమతా బెనర్జీ మాట్లాడుతూ 'కాంగ్రెస్ 300 స్థానాల్లో (బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న దేశవ్యాప్తంగా) పోటీ చేయాలని నేను ప్రతిపాదించాను. కానీ వారు పట్టించు కోలేదు. వారు 300 స్థానాల్లో పోటీ చేస్తే 40 సీట్లు అయినా వస్తాయో లేదో నాకు అనుమానం' అని వ్యాఖ్యానించారు.

స్వాగతిస్తున్నాం... ముందే ఇవ్వాల్సింది

అద్వాణీకి భారతరత్నపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ)

న్యూఢిల్లీ: బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీకి భారతరత్న ప్రకటించడాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాయి. ఇది ఎప్పుడో జరగాల్సిందని, ఇప్పటికే ఆలస్యమైందని పేర్కొన్నాయి. కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. బీజేపీ ఇప్పటికీ స్థిరంగా ఉందంటే అది అద్వాణీ వల్లేనని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ అన్నారు. ఆయనను గుర్తించాలని బీజేపీ ఆలస్యంగా గ్రహించిందన్నారు. బాలాసాహెబ్ ఠాక్రే, సావర్కర్‌కు ఇంకా భారతరత్న ఎందుకు ఇవ్వలేదని శివసేన (ఉద్ధవ్ వర్గం) ప్రశ్నించింది. ఎన్నికలు వచ్చినప్పుడే బీజేపీకి ఈ అవార్డులు గుర్తుకు వస్తాయని శివసేన (యూబీటీ) నేత ఆనంద్ దుబే వ్యాఖ్యానించారు. అద్వాణీకి భారతరత్న ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

దేశాల మధ్య 'న్యాయ' సహకారం అవశ్యం: మోదీ

న్యూఢిల్లీ: కొత్త సవాళ్లను అధిగమించాలంటే న్యాయ వ్యవస్థ మరింత సమ్మిళితమైనదిగా, సరళీకృతమైనదిగా ఉండా లని ప్రధాని మోదీ అన్నారు. నేరగాళ్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని, న్యాయ సరఫరా కోసం ప్రపంచ దేశాల మధ్య సహకారాన్ని ఈ రంగంలో పెంపొందిం చుకోవడం అత్యవసరమని చెప్పారు. దర్యాప్తులకు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అధికార పరిధులను గౌరవించుకుంటూనే 'న్యాయ' సహకారాన్ని పెంచుకోవాలని, న్యాయం కోసం అధికార పరిధిని అస్త్రంగా మార్చాలని సూచించారు. క్రిప్టోకరెన్సీ, సైబర్ ముప్పు దృష్ట్యా కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, వీటిని అధిగమించేందుకు న్యాయ వ్యవస్థ మరింత అనువైనదిగా మారాలన్నారు. మోదీ శనివారం కమాన్‌వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సీఎల్ఈఏ)- కమాన్‌వెల్త్ అటార్నీలు, సొలిసిటర్ జనరల్ కాన్ఫరెన్స్ (సీఏఎస్‌జీసీ)లో మాట్లాడారు. ఎయిర్ ట్రాఫిక్, మారిటైమ్ ట్రాఫిక్ నిర్వహణ రంగంలో దేశాల మధ్య సహకారం ఉందని, దర్యాప్తులు, న్యాయం చేసే అంశాల్లోనూ దేశాలు పరస్పరం సహకరించుకోవాలని మోదీ అన్నారు. 20వ శతాబ్దపు ధోరణితో 21వ శతాబ్దపు సవాళ్లు అధిగమించలేమన్నారు. 100 ఏళ్ల నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన ఆధునిక చట్టాలను తెచ్చుకున్నామని, వీటితో పౌరుల్లో భయం పోయి అభయం లభిస్తుందన్నారు. కోర్టులపై వ్యాజ్యాల భారాన్ని తగ్గించేందుకు సాంకేతికత ఎంతగానో దోహదమవుతోందని తెలిపారు. డ్రోన్ల ద్వారా మ్యాపింగ్ చేయ డంతో గ్రామాల్లో ఆస్తి తగాదాలు నివారించగలుగుతున్నట్లు చెప్పారు. డిజిటలైజేషన్ వల్ల కోర్టులకు ఎంతో ప్రయోజనం ఉన్నదని మోదీ తెలిపారు. అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ సాంకేతికత ఓ శక్తిమంతమైన అస్త్రమన్నారు. న్యాయం- ధర్మం సమగ్రతకు హామీ ఇచ్చేలా సాంకేతిక ఆధారిత పరిష్కారాలు అవసరమని అన్నారు. కోర్ట్‌రూమ్‌ల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన కీలకమని చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్ల దృష్ట్యా వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుకోవడం తక్షణావశ్యమని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి సామర్థ్యాన్ని కలిగివుండటం న్యాయ వ్యవస్థకు అవసరమని అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పరస్పరం సహకరించుకోవాలని సీజేఐ సూచించారు. వక్తల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్, కేంద్ర న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు ఉన్నారు.

నవ భారత నిర్మాణ మార్గదర్శకుడు

అద్వాణీకి భారతరత్నపై ప్రముఖుల శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శుభాకాంక్షలు చెబుతూ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు స్పందిస్తూ 'భారత అభివృద్ధి స్వాప్నికుడు, నవభారత నిర్మాణ మార్గదర్శకుడు, ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడు లాల్ కృష్ణ అద్వాణీకి భారతరత్న ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అద్వాణీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటి నుంచి ఆయన అందించిన మార్గదర్శనం, ప్రత్యేకించి తనపై చూపించిన పుత్ర వాత్సల్యం మరువలేనివని వెంకయ్య నాయుడు తెలిపారు.

అద్వాణీకి భారతరత్న ప్రకటించడంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. బీజేపీ వ్యవస్థాపక సభ్యుడు, ఎంతోమందికి స్ఫూర్తిదాయకమైన వ్యక్తి, మాజీ ఉప ప్రధాని అద్వాణీకి భారతరత్న ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. దశాబ్దాల సేవ, నిబద్ధత, నైతికతకు గుర్తింపు లభించిందని తెలిపారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆయన చేసిన అవిశ్రాంత కృషి అందరిలో ప్రేరణ నింపిందని పేర్కొన్నారు. బీజేపీ నేత నితిన్ గడ్కరీ స్పందిస్తూ 'దేశంలోనే సీనియర్ నాయకుడు, మా మార్గనిర్దేశకుడు అద్వాణీకి భారతరత్న ప్రకటించడం చాలా సంతోషకరమైన విషయం. స్వాతంత్ర్యానంతరం దేశ పునర్నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారు. రాజకీయాల్లో స్వచ్ఛతకు ప్రత్యక్ష ఉదాహరణ. ఆయన ఎప్పుడూ ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా'నని అభినందనలు తెలిపారు. కేంద్రమంత్రులు, బీజేపీ, దాని భాగస్వామ్యపార్టీల నేతలు సైతం అద్వాణీకి భారతరత్న ప్రకటించడంపై ఆనందం వెలిబుచ్చారు.

ఆర్ఎస్ఎస్ కార్యదర్శి నుంచి భారత రత్న వరకు...

న్యూఢిల్లీ: బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వాణీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. అద్వాణీ ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి భారతరత్న వరకు ఎదిగారు. కొన్ని దశాబ్దాలపాటు భారత దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయన వయోభారంతో ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. 1998 నుండి 2004 వరకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో అతల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నారు. ఆ సమయంలో అద్వాణీ హోం మంత్రిగా, తరువాత ఉపప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన 1927 నవంబర్ 8న కరాచీలో శ్రీ కిషించంద్ అద్వాణీ, జ్ఞానీదేవి దంపతులకు జన్మించారు. ఎల్‌కే అద్వాణీ కుటుంబం సింధీ హిందువుల శాఖకు చెందింది. ఆయనను ఇండియన్ పార్లమెంటరీ గ్రూప్ 1999లో అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డుతో సత్కరించింది. తాజాగా దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ఆయనను వరించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి అడుగులు పడటంలో జరిగిన పోరాటంలో అద్వాణీ కీలకపాత్ర పోషించారు. 90వ దశకంలో రామమందిర ఉద్యమానికి అద్వాణీ, మురళీ మనోహర్ జోషి నాయకత్వం వహించారు. ఎల్‌కే అద్వాణీ నేతృత్వంలో 1990లో గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్యలోని రామ జన్మభూమికి బీజేపీ రథయాత్ర జరిగింది. మందిర్ వహీ బనాయేంగే నినాదంతో అద్వాణీ రామమందిర ఉద్యమాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లారు. మురళీ మనోహర్ జోషి రథయాత్రలో కీలకంగా వ్యవహరించారు. రథయాత్రలో ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు. అద్వాణీ కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. 1936 - 1942 వరకు అక్కడే చదువుకున్నారు. ఆయన 1947లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతో అప్పటి నుంచి సామాజిక సేవవైపు మళ్లారు. ఈ క్రమంలో ఆయన కుటుంబం రాజస్థాన్‌లోని మత్స్య - అల్వార్‌కు మకాం మార్చింది. అద్వాణీ అనేక పదవులు అలంకరించారు.

బీజేపీ భయంతో మారిన మమత స్వరం

అధిర్ రంజన్ చౌదరి విమర్శ

ముర్షిదాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కనీసం 40 స్థానాల్లో గెలవకపోవచ్చు అని తృణమూల్ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించడం హస్తం పార్టీకి కోపం తెప్పించింది. దీనిపై కాంగ్రెస్ బెంగాల్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి మండిపడ్డారు. బీజేపీకి భయపడే మమత తన స్వరాన్ని మార్చు కున్నారని, ఆ పార్టీ భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. అధిర్ రంజన్ శనివారం ముర్షీదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు రావాలని అటు బీజేపీ కానీ, ఇటు మమత కానీ కోరుకోవడం లేదు. ఇండియా కూటమి నేతగా మమత ఇలా మాట్లాడటం దురదృష్టకరం. ఆమె స్వయంగా కూటమిలో చేరారు' అని అన్నారు. బీజేపీ అంటే భయపడుతున్నారు కాబట్టే ఆమె వైఖరి మారిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పనైపోయిందని బీజేపీ... 40 సీట్లు కూడా రావని మమత అంటున్నారని, ఇద్దరి భాష ఒకటే ఎలా అని ప్రశ్నించారు. బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందన్న బీజేపీ మాటనే మమత కూడా చెబుతున్నారన్నారు. బెంగాల్‌లో రాహుల్ యాత్రకు కలుగుతున్న ఆటంకాలపై అధీర్ రంజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. యాత్ర సాగించడం కుదరదని స్థానిక యంత్రాంగం శుక్రవారం రాత్రి నుంచి చెబుతోంది. పరీక్షలు జరుగుతున్నాయంటోంది. అందుకు మేమూ ఒప్పుకుంటాం. విద్యార్థులు ఉదయం 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలు 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని ప్రభుత్వ ప్రకటన చెబుతోంది. ప్రశాంతంగా జార్ఖండ్ వెళ్లేందుకు సహకరించాలని బెంగాల్ అధికారులను కోరాం' అని అధిర్ రంజన్ వెల్లడించారు.

ఐడీబీఐలో ప్రభుత్వ వాటాల అమ్మకం?

మోదీ సర్కారు వేగంగా అడుగులు

న్యూదిల్లీ: మోదీ సర్కారు కొన్ని ప్రభుత్వసంస్థల నుంచి చాలాకాలంగా పెట్టుబడులు ఉపసంహరిస్తోంది. వ్యూహాత్మక విక్రయాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పదేపదే చెబుతోంది. తాజాగా ప్రముఖ బ్యాంకులోని ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2024-25లో ఐడీబీఐ బ్యాంక్‌లోని తమ వాటాను ఉపసంహరించుకుంటామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే అన్నారు. తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పాండే మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఈ క్రమంలోనే రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐడీబీఐ వ్యూహాత్మక విక్రయం పూర్తవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి భద్రతాపరమైన అనుమతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి వ్యవస్థీకృత ఆమోదం లభిస్తే... బ్యాంక్‌ను కొనేందుకు ఆసక్తి ఉన్నవారిని బిడ్ల ద్వారా ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పరోక్షంగా, ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వానికి 95 శాతం వాటా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి 45 శాతం వాటా ఉండగా, ప్రభుత్వ రంగ బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)కు 49.24 శాతం వాటా ఉంది. ఈ రెండు వాటాల్లో కలిపి మొత్తంగా దాదాపు 61 శాతం అమ్మేయాలని కేంద్రం యోచిస్తోంది. 2022 అక్టోబర్‌లోనే బిడ్లను ఆహ్వానించగా 2023 జనవరిలో కొంటామని కొందరు ఆసక్తికనబరిచినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, వచ్చే నెలాఖర్లోగా ఖజానాకు రూ.17,500 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. సవరించిన అంచనాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణతో రూ.30 వేల కోట్లను ఖజానాకు తరలించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఐడీబీఐ బ్యాంకులో వాటా కొనుగోలు చేయాలనుకునే బిడ్డర్లకు కనీసం రూ.22,500 కోట్ల కనీస నికర సంపద, గత ఐదేళ్లలో కనీసం మూడేళ్లలో నికర లాభాలు ఉండాలనే నియమాలు ఉన్నాయి. ఒకవేళ బిడ్డర్లు కన్సార్టియంగా ఏర్పడితే... గరిష్ఠంగా నలుగురు మాత్రమే ఉండాలని 'దీపం' షరతు విధించింది. ఒప్పందం కుదిరితే బిడ్డర్లు కనీసం 40 శాతం వాటాలను ఐదేళ్ల వరకు తమ వద్దే అట్టిపెట్టుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ప్రభుత్వ అనాలోచిత విధానాలతోనే ...

ఆర్‌బీకే ఉద్యోగిని ఆత్మహత్యపై రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: రైతు భరోసా కేంద్రం ఉద్యోగిని పూజిత ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలే కారణమని సీపీఐ ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బాపట్ల జిల్లాలోని రైతుభరోసా కేంద్రంలో పనిచేసే పూజిత అధికారుల ఒత్తిడిని, అద్దె భవన యజమాని వేధింపులను తట్టుకోలేక ప్రాణం తీసుకున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. తిరుపతి జిల్లా ఇనగనూరు ఆర్‌బీకే శ్రీలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసిందని, అనంతపురం జిల్లాలో వ్యవసాయ సహాయకులు తమ ఉద్యోగాలు వదిలి వెళ్లిపోయారని రామకృష్ణ గుర్తుచేశారు. రైతులకు మేలు చేసేందుకే ఆర్‌బీకేలను ఏర్పాటు చేశామని చెప్పే జగన్ ప్రభుత్వం వ్యవసాయంలో కీలకమైన విస్తరణ సేవలను విస్మరించిందని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తామన్నారు కానీ వాటి కోసం గోడౌన్లు ఏర్పాటు చేయలేదు. కాలంచెల్లిన పాఠశాల భవనాల్లో, అద్దె షెడ్లలో ఎరువులు నిల్వ ఉంచడంతో చిన్నపాటి వానకే అవి పాడైపోతున్నాయి. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఆర్‌బీకే సిబ్బందికి ఎరువులు, పురుగుమందులు బలవంతంగా విక్రయించే పని అప్పగించారు. ఇది ఉద్యోగ వ్యతిరేక విధానాలకు తార్కాణం' అని రామకృష్ణ దుయ్యబట్టారు. చాలాచోట్ల ఎరువులు తీసుకెళ్లిన వైసీపీ నేతలు డబ్బు చెల్లించకపోవడంతో ఆ భారం ఉద్యోగులపై పడుతోందన్నారు. ఓ పక్క అద్దె భవన యజమానుల ఒత్తిడి, మరోపక్క వ్యవసాయ అధికారుల బకాయిల సమస్యతో రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. మానసిక ఒత్తిడి వల్ల ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం బాధాకరమని రామకృష్ణ అన్నారు. సరైన ప్రణాళిక, సక్రమ అమలు, కనీస సౌకర్యాలు లేకుండా జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం ఉద్యోగులకు సమస్యలు తెస్తున్నట్లు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్‌బీకేలకు గోదాముల వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, అద్దె భవనాలకు బకాయిలు చెల్లించాలని, ఎరువులు తీసుకువెళ్లి డబ్బు చెల్లించని వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని, పూజిత కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా సీతారామయ్య

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, (సింగరేణి): రాంచీలో గురువారం జరిగిన ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో వాసిరెడ్డి సీతారామయ్యను అధ్యక్షులుగా ఎన్ను కున్నారు. ప్రస్తుతం ఆయన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా కొనసాగు తున్నారు. దేశంలో బొగ్గు పరిశ్రమలన్నింటికి ప్రాతినిధ్యం వహించే యూనియన్‌కు అధ్యక్షులుగా ఎన్నిక కావడంపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ హర్షం వెలిబుచ్చింది. ఆర్జివన్ ఏరియా నాయకులు మడ్డి ఎల్లయ్య, కె.స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాసు, ఎం.మహేశ్ ,ఎస్.వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, మిట్ట శంకర్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, నాగేందర్, ప్రభుదాస్, సంపత్, దొంత సాయన్న, బలుసు రవి, తాని రాజబాబు, వొన్నాల లక్ష్మి నారాయణ, ఉప్పులేటి తిరుపతి, పెరుమాండ్ల రమేష్ గౌడ్, దాసరి శ్రీనివాస్, ఎ. రాజు, ఆరేల్లి రాజేశ్వరరావు, సిర్ర మల్లికార్జున్, చెప్యాల భాస్కర్, కార్యాలయ కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు ఆయనను అభినందించారు.

ప్రజా తీర్పును దోచుకునే యత్నం

- విద్వేషాలు-కుల,మత ఘర్షణలు రెచ్చగొడుతున్న బీజేపీ
- ప్రధాని ఆడించినట్లు ఆడుతున్న దర్యాప్తు సంస్థలు
- జార్ఖండ్ పరిణామాలపై రాహుల్ గాంధీ

రాంచీ: ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాలను కూల్చడమే పనిగా బీజేపీ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. విద్వేషాలను రెచ్చగొడుతూ, కులం, మతం పేరిట జనం మధ్య ఘర్షణను ప్రేరేపిస్తోందని దుయ్యబట్టారు. న్యాయ యాత్ర ద్వారా ప్రజలను ఏకం చేయడమే కాకుండా ప్రేమ దుకాణాన్ని పెట్టేందుకు వచ్చానని శనివారం జార్ఖండ్‌లోని గొడ్డా సభలో రాహుల్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీలన్నీ బీజేపీ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని చెప్పారు. దర్యాప్తు సంస్థలను చూసి మేమెవ్వరం భయపడమని రాహుల్ అన్నారు. ప్రజా తీర్పును దోచుకునేందుకు బీజేపీ యత్నించిందని, ప్రధాని ఆడుగుజాడల్లో దర్యాప్తు సంస్థలు నడుచుకుంటు న్నాయని జార్ఖండ్ పరిణామాలనుద్దేశించి విమర్శించారు. ప్రజా తీర్పుకు అండగా నిలిచి జార్ఖండ్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కాపాడిందన్నారు. ఈడీ, సీబీఐని అస్త్రాలుగా మల్చుకొని ప్రజలు ఎన్నుకున్న జార్ఖండ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ కుట్ర చేశారని విమర్శించారు. 'జార్ఖండ్ ప్రభుత్వానికి అన్యాయం జరిగింది. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఈడీ, సీఈఐ, ఐటీ శాఖల ద్వారా లాక్కునేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోంది. తమ ప్రత్యర్థులపై చర్యలు తీసుకోవాలని ఈ సంస్థలకు మార్గదర్శకాలు చేసింది' అని వ్యాఖ్యానించారు. 'సమాజంలో విద్వేషాలను బీజేపీ వ్యాప్తి చేస్తోందని, కులం, మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. గిరిజనయేతరులతో ఘర్షణ పడాలని గిరిజనులను రెచ్చగొడుతోంది. ప్రజలను ఏకం చేసేందుకు నేను జార్ఖండ్‌కు వచ్చా. రాష్ట్రంలో ప్రేమ దుకాణాన్ని తెరవాలని వచ్చా. అణగారిన వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా అన్యాయం జరుగుతోంది. యువత, మహిళలు, రైతులూ అన్యాయమవుతున్నారు' అని రాహుల్ అన్నారు. కాగా, న్యాయ యాత్ర జార్ఖండ్‌లోని 13 జిల్లాల్లో రెండు దశల్లో ఎనిమిది రోజుల పాటు సాగుతుంది.

ఇమ్రాన్, బుష్రాకు ఏడేళ్ల జైలు

ఇద్దత్ కేసులో రావల్పిండి కోర్టు తీర్పు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఒకదాని తర్వాత ఒకటిగా కేసుల్లో శిక్షలు పడుతున్నాయి. ఇటీవల రెండు కేసుల్లో 10 ఏళ్లు, 14 ఏళ్లు చొప్పున శిక్షలు విధించగా తాజాగా ఇద్దత్ కేసులో ఇంకో ఏడేళ్ల శిక్ష విధిస్తూ రావల్పిండి కోర్టు శనివారం ఆదేశాలిచ్చింది. ఆయన భార్య బుష్రా బీబీకీ ఈ శిక్ష అమలు కాబోతోంది. నిబంధనలకు విరుద్ధంగా 'నిఖా' చేసుకున్నారన్న కేసులో ఇమ్రాన్, బుష్రా బీబీకి ఏడేళ్ల శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. బుష్రా మాజీ భర్త ఖవర్ ఫరీద్ మనేకా పెట్టిన కేసుపై అడియాలా జిల్లా జైలులో తాత్కాలిక కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి ఈ మేరకు తీర్పు వెలువరించారు. భార్యాభర్తలకు రూ.5,00,000 జరిమానా విధించారు. పాకిస్థాన్ శిక్షా స్మృతి (పీపీసీ)లోని 496వ సెక్షన్ కింద వీరిని దోషులుగా తేల్చుతూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. బుష్రా బీబీ 2017 నవంబరులో ఫరీద్ నుంచి విడాకులు తీసుకున్నారు. 2018 జనవరిలో ఇమ్రాన్‌ను వివాహం చేసుకున్నారు. ఇస్లామిక్ నిబంధనల ప్రకారం భర్త చనిపోయినా, విడాకులు తీసుకున్నాగానీ భార్య మరో పెళ్లి చేసుకోవాలంటే కొంత సమయం తీసుకోవాలి. దీనినే 'ఇద్దత్' అంటారు. ఇద్దత్ ఆచరించకుండా ఇమ్రాన్, బుష్రాల వివాహం జరిగిందని ఆమె మాజీ భర్త ఆరోపించారు. దీంతో ఈ కేసులో ఇమ్రాన్ దంపతులకు శిక్ష పడింది. తోషాఖానా కేసులో బుష్రా బీబీకి కూడా 14ఏళ్ల జైలుశిక్ష పడిన విషయం తెలిసిందే. అయితే తాజా కేసులో పడిన శిక్షను పై కోర్టులో సవాల్ చేస్తామని ఇమ్రాన్ ఖాన్ పార్టీ 'పీటీఐ' బారిస్టర్ గౌహర్ అలీ ఖాన్ తెలిపారు. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. ఇద్దత్ కేసు అవమానకరం, నిరాధారితమైనదిగా అయనన్నారు. ఇమ్రాన్ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

జార్ఖండ్‌లో బలపరీక్ష రేపు

- హైదరాబాద్ రిసార్టులో ఎమ్మెల్యేలకు పోలీసు భద్రత
- విశ్వాస ఓటు వేసేందుకు సోరెన్‌కు కోర్టు అనుమతి

రాంచీ: జార్ఖండ్ రాజకీయాలు ఉత్కంఠ భరితంగా మారాయి. హేమంత్ సోరెన్ రాజీనామా, అరెస్టు క్రమంలో కొత్త ముఖ్యమంత్రిగా జేఎంఎం సీనియర్ నేత చంపై సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇది జరిగిన మూడు రోజుల తర్వాత అంటే సోమవారం బలపరీక్షకు మహూర్తం ఖరారైంది. సీఎం చంపై అధ్యక్షతన జార్ఖండ్ ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశంతో ఈ మేరకు నిర్ణయం జరిగింది. జార్ఖండ్ రాజకీయం ఇప్పటికే తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు చేరుకుంది. జేఎంఎం నేతృత్వ కూటమికి చెందిన 38 మంది ఎమ్మెల్యేలు అక్కడి రిసార్టులో ఉన్నారు. బలపరీక్షకు ముందు బీజేపీ వారిని తమ వైపునకు తిప్పుకునే అవకాశం ఉన్నందున హుటాహుటిన షామీర్‌పేట్‌లోగల 'లియోనియా హోలిస్టిక్ డెస్టినేషన్'కు జార్ఖండ్ ఎమ్మెల్యేలను తరలించారు. రిసార్టులోని మొదటి నాలుగు అంతస్తులు ఎమ్మెల్యేలకు కేటాయించారు. వేరెవ్వరూ ఆ అంతస్తుల్లోకి ప్రవేశించేందుకు అనుమతి లేదు. ఎమ్మెల్యేలకు ఓ లిఫ్ట్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. వీరి కోసం మొదటి అంతస్తులో వేరేగా భోజన వసతి కల్పిం చారు. సీఎంగా చంపై సోరెన్, మంత్రులుగా కాంగ్రెస్ నేత అంగిర్ ఆలమ్, ఆర్జేడీ నేత సత్యా నంద్ భోక్తా ప్రమాణ స్వీకారం జరిగిన వెంటనే ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు పయనమైన విషయం తెలిసిందే. కాగా, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను సోమవారం జరగబోయే బలపరీక్షలో ఓటు వేసేందుకు రాంచీలోని ప్రత్యేక న్యాయస్థానం శనివారం అనుమతిచ్చింది. సోమ, మంగళ వారాలలో అసెంబ్లీలో ఈ ఓటింగ్ జరగనుంది. బుధవారం మనీలాండరింగ్ కేసులో సోరెన్ అరెస్టు కావడం విదితమే.

మార్చి 18 నుంచి పది పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులకు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 28, 30 తేదీల్లో కాంపోజిట్, ఓరియంటల్, ఒకేషనల్ కోర్సుల పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు శనివారం ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి షెడ్యూలు ప్రకటించారు. 18వ తేదీన ఫస్ట్ లాంగ్వేజీ (గ్రూప్ ఏ), ఫస్ట్ లాంగ్వేజీ పేపర్-1 (కాంపోజిట్ కోర్స్), 19న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీషు, 22న మేథమేటిక్స్, 23న ఫిజికల్ సైన్సెస్, 26న బయలాజికల్ సైన్స్, 27న సోషల్ స్టడీస్, 28న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, ఓరియంటల్ లాంగ్వేజ్ కోర్సు పేపర్-1, 30న మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2, ఎస్ఎస్‌సి ఒకేషనల్ కోర్సు (థియరీ).

జైస్వాల్ డబుల్ సెంచరీ

- అదరగొట్టిన బుమ్రా
- ఆరు వికెట్లు తీసిన పేసర్
- రెండో రోజు ఇంగ్లాండ్‌పై భారత్ ఆధిక్యత
- భారత్ మొదటి ఇన్నింగ్స్: 396
- ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్: 253
- భారత్ రెండో ఇన్నింగ్స్ 28/0

విశాఖపట్నం: విశాఖపట్నం వేదికగా ఇంగ్లాండ్-భారత్ టెస్ట్ రెండో రోజు ఆట ముగిసింది. టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ చెలరేగి ఆడి డబుల్ సెంచరీ చేశాడు. పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆరు వికెట్లు తీసి అదరగొట్టాడు. ఆట ముగిసే సమయానికి రోహిత్ శర్మ (13), జైస్వాల్ (15) పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం 171 పరుగుల ఆధిక్యతతో భారత్ ఉంది. ఓవర్‌నైట్ 336/6 స్కోరుతో రెండోరోజు ఆటను ప్రారంభించిన భారత్ 60 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. మరోవైపు ఇంగ్లాండ్‌కు అదిరే ఆరంభం లభించింది. ఓ దశలో 22.2 ఓవర్లలో 114/1తో నిలిచింది. ఓపెనర్ జాక్ క్రాలీ 78 బంతుల్లో 76 పరుగులు చేశాడు. 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి అర్ధశతకం బాదాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్, కెప్టెన్ బెన్‌స్టోక్స్ (47బీ 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా దూకుడు ప్రదర్శించాడు. తొలుత బెన్ డకెట్ (21)ని కుల్‌దీప్ ఔట్ చేయగా.. దూకుడుగా ఆడుతున్న క్రాలీ.. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయి శ్రేయస్ అయ్యర్‌కు దొరికిపోయాడు. అనంతరం బుమ్రా తన వికెట్ల వేట మొదలుపెట్టాడు. వరుస ఓవర్లలో జో రూట్ (21), హీరో ఓలీ పోప్ (23)ని పెవిలియన్‌కు పంపాడు. విరామం సమయానికి ఇంగ్లాండ్ 155/4 స్కోరుతో నిలిచింది. మూడోసెషన్ ప్రారంభమైన కొద్దిసేపటికి బుమ్రా బౌలింగ్‌లో బెయిర్‌స్టో (25).. స్లిప్‌లో గిల్‌కు చిక్కాడు. కుల్‌దీప్ యాదవ్ స్వల్పవ్యవధిలో బెన్ ఫోక్స్ (6), రెహాన్ అహ్మద్ (6)ను వెనక్కి పంపాడు. అర్ధశతకం దిశగా సాగుతున్న స్టోక్స్‌ని బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేసి టెస్టుల్లో 150 వికెట్ల మైలురాయిని అదుకున్నాడు. చివరి రెండు వికెట్లు హార్ట్‌లీ (21), జేమ్స్ అండర్సన్ (6) కూడా బుమ్రాకే దక్కాయి. కుల్‌దీప్ యాదవ్ 3, అక్షర్ పటేల్ ఓ వికెట్ పడగొట్టారు. ఇంగ్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయి 253 పరుగులకు ఆలౌట్ అయింది. మూడో రోజు భారత్ జట్టు ఇదే జోరు కొనసాగిస్తే ఇంగ్లాండ్ భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వస్తుంది. అంతకుముందు 336/6 స్కోరుతో రెండోరోజు ఆటను ప్రారంభించిన టీమిండియా 396 పరుగులకే ఆలౌట్ అయింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (209) డబుల్ సెంచరీ చేశాడు.

బకాయిలు మేమే చెల్లిస్తాం

- 21న 'ఉపాధి' కూలీల ఖాతాల్లో జమ చేస్తాం
- 48 గంటల ధర్నాలో సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెండింగ్‌లో ఉంచిన 21 లక్షల మంది ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం ప్రకటించారు. ఫిబ్రవరి 21 నాటికి వారి బ్యాంకు ఖాతాలకు వేతనాలు జమచేస్తామన్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం బెంగాల్ ప్రభుత్వానికి పెండింగ్‌లో ఉన్న కేంద్ర బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆమె రెండు రోజుల నిరసన ప్రారంభించిన ఒక రోజు తర్వాత ముఖ్యమంత్రి మమత ఈ ప్రకటన చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన 'బకాయి నిధులు' ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఎం మమత చేపట్టిన ధర్నా చలి మధ్య రాత్రంతా కొనసాగింది. యుటిలైజేషన్ సర్టిఫికెట్ల సమర్పణలో జాప్యంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికను ఖండిస్తూ ఆమె ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ కూడా రాశారు. 'తప్పు నివేదిక 'తప్పుదోవ పట్టించే చిత్రం' సృష్టిస్తుందని 'రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంపై తప్పుడు ప్రచారానికి' కొంతమంది ఉపయోగించుకుంటున్నారని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారు. 2002-03 నుంచి 2020-21 వరకు రూ. 2,29,099 కోట్ల యుటిలైజేషన్ సర్టిఫికెట్ల సమర్పణలో జాప్యం జరిగినట్లు 2020-21 సంవత్సరానికి కాగ్ రాష్ట్ర ఆర్థిక ఆడిట్ నివేదికలో నివేదించినట్లు తృణమూల్ కాంగ్రెస్ అధిష్ఠానం తెలిపింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఆయా కేంద్ర మంత్రిత్వ శాఖలకు సమయానికి సమర్పించిందని ఆమె తెలిపారు. 'మేము బీజేపీని అడుక్కోవా లనుకోలేదు లేదా వారి భిక్ష కూడా కోరుకోము. మూడేళ్లలో 100 రోజుల పని పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) లో పనిచేసినా కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు అందని 21 లక్షల మంది కార్మికుల బ్యాంకు ఖాతాలకు ఫిబ్రవరి 21 నాటికి నగదు బదిలీ చేస్తాం. ఇది నా మొదటి అడుగు' అని బెనర్జీ ధర్నా స్థలంలో ప్రకటించారు. 'బెంగాల్ ఆకలితో అలమటించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. అందులో విజయం సాధించడానికి మేము వారిని అనుమతించము. నాపై నమ్మకం ఉంచండి. ఇంకా నిలిచిపోయిన నిధులను దశలవారీగా జమ చేయడానికి నేను ప్రయత్నిస్తాను' అని అన్నారు. 'ఈ పోరాటం అణగారిన ప్రజల కోసం. మేము మా పోరాటం కొనసాగిస్తాం. బెంగాల్‌లో ఒక్క పేదవాడిని కూడా కోల్పోనివ్వం. నేను బతికే వరకు మీ కోసం పోరాడతాను' అని ముఖ్యమంత్రి అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం తమ పార్టీ అన్నింటికీ వెళుతుందని బెనర్జీ అన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టడం ఖాయమని పేర్కొన్నారు. 'నేను అన్నీ ఆడతాను. అన్నీ గెలుస్తాను. అన్ని రాష్ట్రాలు, అన్ని సంస్థలు. అన్ని ప్రాంతీయ, జాతీయ పార్టీలు ముందుకు వస్తే, అప్పుడు బీజేపీ పతనం తప్పదని నేను భావిస్తున్నాను. తాము ఎక్కువ కాలం ఇక్కడే ఉంటామని బీజేపీ భావిస్తే అది తప్పు. వారు చాలా కాలం పాటు దేశ ప్రజలను హింసించారు' అని ఆమె అన్నారు. రాష్ట్రంలో పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల నమోదు (ఎన్ఆర్సీ) అమలును 'ఎప్పటికీ అనుమతించబోనని' పునరుద్ఘాటించారు. కాగా, మాజీ క్రికెటర్, రాజకీయ నాయకుడు కీర్తి ఆజాద్, సామాజిక కార్యకర్త యోగేంద్ర శర్మ శనివారం బెనర్జీని ధర్నా శిబిరాన్ని సందర్శించారు. కోల్‌కతా నడిబొడ్డున మైదాన్ ప్రాంతంలోని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు బెనర్జీ తన పార్టీ టీఎంసీ నేతలతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ధర్నా ప్రారంభించారు. బెనర్జీ వెంట వచ్చిన వారిలో ఫిర్హాద్ హకీమ్, అరూప్ బిస్వాస్ వంటి రాష్ట్ర మంత్రులు కూడా ఉన్నారని పార్టీ నాయకులు శనివారం ఉదయం తెలిపారు. ఇదిలాఉండగా, శనివారం ఉదయం ఆమె రెడ్ రోడ్ సమీపంలో నడిచారు. ఒక బాస్కెట్‌బాల్ మైదానాన్ని కూడా సందర్శించారు. శుక్రవారం మమతా బెనర్జీ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, పీఎం ఆవాస్ యోజనతో సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలను బకాయిపడిందని ఆరోపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఆమె చేపట్టిన ధర్నా 48 గంటల పాటు కొనసాగనుంది. సోమవారం నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానుండగా ఆదివారం వరకు 48 గంటల పాటు ధర్నా కొనసాగనుంది.

ఆ ఏడుగురు ఎవరో చెప్పండి

కేజ్రీవాల్‌కు దిల్లీ పోలీసుల నోటీసులు

సీఎం నివాసం వద్ద వాగ్వాదం: బీజేపీవన్నీ నాటకాలే: ఆప్ విమర్శ

న్యూదిల్లీ: తమ ఎమ్మెల్యేలను ఆకర్షించేందుకు, ప్రలోభ పెట్టేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించినందుకు దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు, మద్యం పాలసీ కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు జారీ చేసిన సమన్లను పాటించడం లేదంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోర్టును ఆశ్రయించింది. ఇదిలాఉండగా, ఆప్ నుంచి నిష్క్రమించేలా బీజేపీ నుంచి ప్రలోభాలను ఎదుర్కొన్న ఆ ఏడుగురు ఎమ్మెల్యేలు ఎవరో పేర్లు వెల్లడించాలని ఈడీ నోటీసు పేర్కొంది. ఈ నోటీసును అందజేసేందుకు శనివారం సీఎం నివాసానికి దిల్లీ క్రైంబ్రాంచ్ బృందం చేరుకుంది. సుమారు ఐదు గంటలు వేచివున్న తర్వాత సీఎం అందుబాటులోకి రాకపోవడంతో అక్కడి సిబ్బందికి నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో సీఎం నివాసం వద్ద అధికారులకు, క్రైంబ్రాంచ్ బృందానికి మధ్య వాగ్వాదం జరిగింది. సీఎంను వ్యక్తిగతంగా కలిసి ఆయనకు నోటీసులు ఇస్తామని క్రైంబ్రాంచ్ అధికారులు పట్టుబట్టడం వాగ్వాదానికి దారితీసింది. దీనికి సంబంధించిన వీడియోను ఆప్ నేత జాస్మిన్ షా 'ఎక్స్'లో పెట్టారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను వ్యక్తిగతంగా కలిసి మరీ నోటీసులు ఇచ్చేందుకు ఏ చట్టం అధికారమిస్తుందని క్రైంబ్రాంచ్ అధికారిని జాస్మిన్ షా నిలదీయడం వీడియోలో ఉంది. 'సీఎం ఇంటి వద్ద క్రైంబ్రాంచ్ అధికారికి ఓ సరళమైన ప్రశ్న వేశా. ఏ చట్టం ప్రకారం మీరు సీఎంను వ్యక్తిగతంగా కలిసి నోటీసు ఇస్తారు? అని ... ఆయన వద్ద సమాధానమే లేకపోయింది. ఇదంతా నాటకం తప్ప మరేమీ కాదు' అని జాస్మిన్ షా వ్యాఖ్యానించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఇదంతా చేస్తున్నారని, నోటీసులను సీఎం కార్యాలయానికి అందజేయడం లేదని మంత్రి సౌరభ్ భరద్వాజ్ వ్యాఖ్యానించారు. 'ఇది మోదీ ప్రభుత్వానికి సిగ్గుచేటు. బీజేపీ ముసుగు తొలగిపోయింది. సీఎం కార్యాలయం ... పోలీసుల నుంచి నోటీసు తీసుకోలేదని బీజేపీ అధికార ప్రతినిధి నిన్న ఆరోపించారు. ఈరోజు వారి అబద్ధాలు బట్టబయలయ్యాయి. ఏసీపీ కావాలనే సీఎం కార్యాలయానికి నోటీసు పంపలేదు' అని భరద్వాజ్ ట్వీట్ చేశారు. ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభాలకు గురిచేస్తోందని, ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆశ చూపి, ఏడుగురు ఎమ్మెల్యేలు పార్టీ వీడేలా కుట్ర పన్నిందని కేజ్రీవాల్ విమర్శలు చేశారు. ఆప్ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని హెచ్చరికలు చేసిందన్నారు. దీంతో కేజ్రీవాల్‌కు ఈనోటీసులు జారీ అయ్యాయి. మంత్రి అతీషి ఇటీవల విలేకరులతో మాట్లాడుతూ దిల్లీలో బీజేపీ 'ఆపరేషన్ కమలం 2.0' మొదలు పెట్టింది. ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు గతేడాది విఫలయత్నం చేసింది' అని వ్యాఖ్యానించారు. దీంతో బీజేపీ దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవతో పాటు ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసి దర్యాప్తునకు డిమాండ్ చేశారు. దీనిపై క్రైమ్ బ్రాంచ్ విచారణ చేపట్టింది. చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు చూపాలని కేజ్రీవాల్‌కు సూచించగా ఆప్ తరపున ఇప్పటివరకు ఎవరూ ఎలాంటి ఆధారాలు చూపలేదని సచ్‌దేవ పేర్కొన్నారు.

సమన్లను దాటవేయడంపై కోర్టును ఆశ్రయించిన ఈడీ

దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు జారీ చేసిన సమన్లను పాటించడం లేదంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా ఆయనపై ఫిర్యాదు చేసింది. ఈడీ జారీ చేసిన సమన్లను పాటించనందుకు ప్రభుత్వ సేవకుడి ఆదేశాలకు, మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 50కి కట్టుబడి హాజరు కానందుకు ఐపీసీ సెక్షన్ 174 కింద దిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. కాగా, ఈ కేసును ఫిబ్రవరి 7న కోర్టు విచారణకు స్వీకరించనుంది. ఇప్పటి వరకు కేంద్ర దర్యాప్తు సంస్థ అరవింద్ కేజ్రీవాల్‌కు ఐదు సమన్లు జారీ చేసింది. మద్యం పాలసీ కుంభకోణంపై జరుగుతున్న విచారణకు హాజరు కావాలని డిమాండ్ చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.